
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 05.08.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 09 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# అనాథగా ఆంధ్రా!



- పార్లమెంటు సాక్షిగా దగా
- ఏపికి టోపీ పెట్టిన బీజేపీ
- ఉద్యమబాటలో వైసిపి
- సందిగ్ధంలో టీడీపీ

**2014 ఏ.పి విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాను ఐదేళ్లు కాదు, పదేళ్లు కల్పించాలని ఎవరైతే పోరాడారో, ఏ సభలో అయితే దీని గురించి మాట్లాడారో అదే అరుణ్‌జైట్లీ... అదే రాజ్యసభలో ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని తేల్చి చెప్పాడు. విభజన బిల్లులో వున్న హామీలన్నింటిని అమలు చేస్తాం... ఆ హోదా ఒక్కటి మాత్రం అడక్కండి అన్నట్లుగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రత్యేకహోదా అంశానికి తెరదించాడు. ఆనాడు విభజన సమయంలో పార్లమెంటులో పోరాడిన ఒకేఒక్కడు వెంకయ్యనాయుడు సైతం ఈ విషయంలో అటూ మాట్లాడలేక ఇటూ పోరాడలేక నీళ్లు మింగుతున్నాడు.**

(మిగతా 11వ పేజీలో)

## రాష్ట్ర రాజకీయ తెరపై...
# మహా కూటమి?



**ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న సరికొత్త ప్రయోగమే మహాకూటమి. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లోనే కాకుండా, పలు రాష్ట్రాలలోనూ ఈ ప్రయోగాన్ని అమలు చేస్తున్నారు. 2004లో సోనియాగాంధీ జాతీయ స్థాయిలో చేసింది ఇదే! ఎన్డీఏ వ్యతిరేక పార్టీలన్నింటిని కలిపి యూపిఏను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చేశారు.**

రేపటి ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఇదే ప్రయోగం జరగబోతోందా? ఈ ప్రశ్నకు అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా ఉండడం కోసం విపక్షాలన్నీ

(మిగతా 11వ పేజీలో)

## ప్రత్యేక పోరులో...
# వెనుకబడ్డ తెదేపా
# ముందంజలో వైకాపా

**పార్లమెంటులో ఏపి ప్రత్యేకహోదా ప్రైవేట్ బిల్లు తెచ్చింది కాంగ్రెస్ ఎంపి కె.వి.పి.రామచంద్రరావే అయినా, దీనిమూలంగా రాష్ట్రంలో రాజకీయ ప్రయోజనం పొందింది వైకాపా! ఈ అంశంలో ప్రజల చేత చీకొట్టబడింది తెలుగుదేశం. అవును... కాంగ్రెస్ తెచ్చిన ప్రత్యేక హోదా ప్రైవేట్ బిల్లు వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేకపోయినా రాష్ట్ర రాజకీయాలలో పెను మార్పులు చేసుకున్నాయి. ఈ అంశాన్ని వైకాపా శ్రేణులు బ్రహ్మాస్త్రంగా మలచుకుని అటు ఢిల్లీలోనూ ఇటు రాష్ట్రంలోనూ బాగానే రెచ్చిపోయారు. ఏపికి ప్రత్యేకహోదా కోసం పోరాడుతున్నది తమ పార్టీయేనని ప్రజల్లో ముద్ర వేసుకోవడమే కాదు, ప్రత్యేకహోదాను గట్టిగా డిమాండ్ చేయని పార్టీగా తెలుగుదేశంను ప్రజా న్యాయస్థానంలో నిలబెట్టారు.**

ప్రత్యేకహోదా ప్రైవేట్ బిల్లు విషయంలో వైకాపా అధినేత జగన్ చాకచక్యంగా వ్యవహరించాడు. కాంగ్రెస్ పెట్టిన బిల్లు అని చూడకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏ పార్టీ బిల్లు పెట్టినా మద్దతిస్తామంటూ ప్రకటించారు. రాజ్యసభలో వైకాపాకు ఉండేది ఒకే ఒక సభ్యుడు విజయసాయిరెడ్డి. ఆయనకు ఇవి మొదటి సమావేశాలు. అయితేనేం... హోదా బిల్లుపై ఎంతో వ్యూహాత్మకంగా మాట్లాడాడు. వైకాపా వాదనను బలంగా వినిపించాడు. హోదాతో ముడిపడ్డ రాష్ట్ర భవిష్యత్‌ను వివరించాడు. విజయసాయిరెడ్డి తెలివితేటలు, ఆయన ప్రతిభాశక్తి తెలుసు కాబట్టే ఆయనను రాజ్యసభలో అడుగుపెట్టకుండా చేయడానికి చంద్రబాబు చేయని ప్రయత్నాలంటూ లేవు. రాజ్యసభ ఎన్నికలకు ముందే వైకాపా నుండి 20మంది ఎమ్మెల్యేలను లాగేసారు. మరో 14మందిని లాక్కుని వుంటే విజయసాయికి రాజ్యసభ ఆశలు గల్లంతయ్యేవి. కాని అది సాధ్యం కాలేదు. విజయసాయిరెడ్డి రాజ్యసభలో అడుగుపెట్టినందువల్ల తెలుగుదేశంకు ఏ స్థాయిలో నష్టం జరగాలో ఆ స్థాయిలో జరుగుతోంది.

ఇక లోక్‌సభలో సైతం వైకాపా ఎంపీలు వెల్‌లోకి దూసుకుపోయి హోదా ఇవ్వనందుకు నిరసన తెలుపుతుంటే, తెలుగుదేశం ఎంపీలు మాత్రం తమ స్థానాల నుండి ముందుకు కదలలేకపోయారు. ముఖ్యంగా కేంద్రమంత్రిగా వున్న సుజనాచౌదరి ఎక్కడ చంద్రబాబు పొత్తుకు కటీఫ్ చెబుతాడో, తన మంత్రి పదవి ఎక్కడ ఊడుతుందోనని అనుక్షణం ఆందోళన చెందాడు. మిగతా తెలుగుదేశం ఎంపీలు కూడా చంద్రబాబు నుండి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో ప్రత్యేకహోదాపై పార్లమెంటులో గట్టిగా నిలదీయలేకపోయారు.

(మిగతా 11వ పేజీలో)





## భక్తుడికే భగవంతుడి అనుగ్రహం...

# శివయ్య సేవకు మళ్ళీ గిరయ్య



ఆలయ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆల్తూరు గిరీష్‌రెడ్డి

నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూల స్థానేశ్వర స్వామి దేవస్థానం చైర్మెన్‌గా వరుసగా రెండోసారి ఆల్తూరు గిరీష్ కుమార్‌రెడ్డినే నియమించారు. ఈమేరకు కొత్త పాలకమండలిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త పాలకమండలిలో గిరీష్‌రెడ్డితో పాటు మద్దిన విశ్వనాథ్, మానికల సునీల్, సి.రామకృష్ణ, గంగుల జనార్ధన్‌రావు, నూనె లక్ష్మీవరప్రసాద్, కొండూరు గీత, మావిళ్ల పల్లి వెంకటేశ్వర్లు నాయుడు, శివప్రసాద్ రెడ్డిలు సభ్యులుగా, సి.సుబ్రహ్మణ్యం గురుకుల్ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నియమితులయ్యారు. దేవస్థానం పాలక మండలి ఛైర్మెన్‌గా ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఈ నెల 4వ తేదీ బాధ్యతలు చేపట్టారు.

మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి ఆల్తూరు కుటుంబం ఎంతో కృషి చేసింది. ఆల్తూరు ఆదినారాయణ రెడ్డి, వారి కుమారులు మహేష్‌రెడ్డి, గిరీష్ రెడ్డిలు భూరి విరాళాలతో ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టారు. గత రెండేళ్లలో గిరీష్‌రెడ్డి ఛైర్మెన్‌గా దేవస్థానంలో సరస్వతి దేవి ఆలయం, రాహుకేతు మండపం, స్వామివారి ఉద్యానవనం నిర్మించారు. ఆలయంలో గోశాలను ఏర్పాటు చేయడమే కాకుండా నిత్యం గోపూజ చేసుకునేలా భక్తులకు అవకాశం కల్పించారు. రాహు కాల పూజలో పాల్గొనే మహిళా భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ప్రతి వినాయకచవితికి పర్యావరణ పరిరక్షణలో భాగంగా భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్తీక మాసంలో భక్తుల సౌకర్యార్థం అనేక మార్పులు తీసుకొచ్చారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో శివదీక్షలు ప్రారంభింపజేశారు. శివుని మీద భక్తితో ఆయన నిష్టగా తన ధర్మాన్ని నిర్వర్తించే వారు. భక్తిభావంతో పనిచేసే గిరీష్‌రెడ్డికి మరోసారి శివుని సేవ చేసుకునే అదృష్టం దక్కడం ఆనందించాల్సిన విషయమే. ఆయనకు 'లాయర్' అభినందనలు.

ఆలయ పాలక మండలి ఛైర్మెన్‌గా 4వ తేదీ ఉదయం స్వామి సన్నిధిలో ఆల్తూరు గిరీష్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కొత్త పాలకవర్గ సభ్యుల చేత ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆల్తూరు ఆది నారాయణరెడ్డి కుటుంబసభ్యుల చేతుల మీదుగా నూతనంగా ఏర్పాటు చేసిన గోశాలను ప్రారంభించారు. నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ఆలయానికి విచ్చేసి ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన గిరీష్‌రెడ్డిని అభినందించారు.



గోశాలను ప్రారంభిస్తున్న ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, గిరీష్‌రెడ్డి, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి

సింహపురి సమాచారం

### శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి గుడి

## పాలకమండలి

మూలాపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి దేవస్థానంకు కూడా కొత్త పాలక మండలిని ఏర్పాటు చేశారు. పాలక మండలి సభ్యులుగా కంచి నాగేశ్వరరావు, చెంగల్పట్టు శ్రీధర్, రాజమన్నార్, పవన్ కుమార్, తిరువత్తూర్ శివశంకర్, చింతల నాగరాజు, నట్టిపోగు రమణయ్య, కొత్తూరు పుష్పలత, తంజావూరు మల్లిఖార్జునలను, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా రాజగోపాల్‌ను నియమించారు.

# 'ప్రత్యేక' బంద్ జయప్రదం



బంద్ సందర్భంగా నెల్లూరులో బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్న అనిల్, కోటంరెడ్డిలు

రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోసం, టీడీపీ, బీజేపీల తీరుకు నిరసనగా వైయస్సార్‌సిపి అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా మంగళవారం నెల్లూరుజిల్లాలో జరిగిన బంద్ సక్సెస్ అయ్యింది. వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఆందోళనకారులు మూసివేయించారు. ఆర్టీసీ డిపోల వద్ద బైఠాయించి బస్సులు బయటకు కదలకుండా అడ్డుకున్నారు. జిల్లాలోని 10ఆర్టీసీ డిపోల్లో 400 పైగా బస్సులు డిపోల్లోనే ఆగిపోయాయి. నెల్లూర్లో కొన్ని చెదురుమదురు సంఘటనలు మినహా బంద్ ప్రశాంతంగా జరిగింది. బంద్ చేస్తున్న కొంతమందిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బంద్‌కు కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, వాటి అనుబంధ సంఘాలు మద్దతు ప్రకటించాయి.

నెల్లూరు నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్‌ల వద్ద వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి పార్థసారధి, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, దశరథరామయ్యలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు బస్టాండ్ల నుంచి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు.

సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలో ప్రత్యేకహోదా కోసం జాతీయ రహదారిపై బంద్ నిర్వహిస్తున్న వారితో పాటు ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంలో పోలీసులు కాకాణిని అరెస్ట్ చేశారు.

సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో సూళ్లూరుపేట – శ్రీహరికోట రోడ్డులో దావాదిగుంట వద్ద రోడ్డుపై బైఠాయించడంతో సుమారు రెండు గంటల పాటు షార్‌కు వెళ్లే పలు వాహనాలు బారులు తీరి ఆగిపోయాయి. అనంతరం పట్టణంలో దుకాణాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులను మూయించారు.

కోవూరు నియోజకవర్గంలోని కోవూరు, ఇందుకూరుపేట, విడవలూరు, కొడవలూరు మండలాల నాయకులందరూ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డితో కలిసి కోవూరులో బంద్ నిర్వహించారు. జాతీయ రహదారిపై ధర్నా చేశారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేయించారు.

ఉదయగిరిలో వైయస్సార్‌సిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 6గంటలకే ఆర్టీసీ బస్టాండ్ వద్ద బైఠాయించి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. పట్టణంలో ర్యాలీ చేస్తున్న మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం నాయకులు కాకు వెంకటయ్యతో పాటు ఆందోళనకారులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

ఆత్మకూరులో ఉదయం 5గంటల నుంచే వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు బంద్ ప్రారంభించారు. విద్యార్థి విభాగం నాయకుల ఆధ్వర్యంలో ఆత్మకూరు సత్రం సెంటర్ నుంచి నెల్లూరుపాలెం సెంటర్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. నెల్లూరుపాలెం సెంటర్ వద్ద ఎమ్మెల్యే గౌతంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కారణంగా భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

గూడూరు పట్టణంలో పార్టీ సమన్వయకర్త మేరిగ మురళీధర్, పార్టీ సిఇసి సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ చేరుకుని బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు మూయించారు. టవర్‌క్లాక్ కూడలి వద్ద పోలీసులు మేరిగ, ఎల్లసిరిలను అడ్డుకుని అరెస్ట్ చేశారు.

వెంకటగిరిలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపోల వద్ద కార్యకర్తలు బైఠాయించి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

కావలి పట్టణంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆర్టీసీ డిపో వద్ద బైఠాయించి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ ఆందోళనలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శుభాకాంక్షలు

గత 22ఏళ్ళుగా విభిన్నమైన రుచులతో
నెల్లూరీయుల ఆదరాభిమానాలు పొందిన కేక్స్ కార్నర్ ఆధ్వర్యంలో
ఆహార ప్రియులకు కానుకగా... నెల్లూరు వేదికగా...

Temptation
Unit of Cakes Corner
Pastries
Sweets
Ice creams
Pizzas
Burgers

ప్రారంభించిన శుభసందర్భంగా మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

అనుమారెడ్డి రామ్‌ప్రతాప్‌రెడ్డి

సాయి ప్రతాప్ ఎయిర్ కండీషనర్స్

15/173-ఎ, బృందావనం, నెల్లూరు - 1. ఫోన్. 0861 - 2347273.





పుట్టినరోజు శుభాకాంక్షలు

నాపై అనునిత్యం అనురాగం
చూపిస్తూ... అభిమానం పంచుతున్న
మా ముద్దుల అన్నయ్య

సాయిధర్మతేజ కి

పుట్టినరోజు(11.08.16)
శుభాకాంక్షలు.

చెల్లెలు - శరణ్య
దీవెనలతో...
నాన్న - డి.శ్యాంకుమార్
అమ్మ - డి.నాగలక్ష్మి
ఆశీస్సులతో... తాతయ్య, నానమ్మ

# హోదాతోనే రాష్ట్ర భవిష్యత్

## ○ నెల్లూరు యువభేరిలో జగన్ ○ పోటెత్తిన యువత






ప్రత్యేకహోదాతోనే రాష్ట్ర భవిష్యత్ ముడిపడి ఉందని ప్రతిపక్ష నేత, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి స్పష్టం చేశాడు.

ఈ నెల 4వ తేదీన నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగిన యువభేరి సదస్సుకు ఆయన హాజరయ్యాడు. ఉదయం 10.30గంటలకు సదస్సు ప్రారంభం కావాల్సినప్పటికి, హైదరాబాద్‌లో జగన్ ఫ్లైట్ మిస్సయి తదుపరి ఫ్లైట్‌కు రావడంతో 1.30 గంటలకు మొదలైంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి విద్యార్థులు, యువకులు వేలాదిగా తరలి వచ్చి జగన్ కోసం ఓపికగా ఎదురుచూసారు.

తిరుపతి ఎయిర్‌పోర్టు నుండి నెల్లూరుకు బయల్దేరిన జగన్‌కు దారి పొడవునా వైకాపా కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. కస్తూరిదేవి గార్డెన్స్ వేదికగా జరిగిన యువభేరి సదస్సులో ఎక్కువగా ఆయన విద్యార్థులకే మాట్లాడే అవకాశమిచ్చాడు. దాదాపు 40మంది విద్యార్థులు ఈ సదస్సులో ప్రత్యేక హోదాపై మాట్లాడి, ప్రత్యేకహోదాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిని ఎండగట్టారు. ప్రత్యేకహోదా ఉద్యమంలో జగన్ వెన్నంటి నడుస్తామని వారు ఉత్సాహంగా ముందుకొచ్చారు.

విద్యార్థులనుద్దేశించి జగన్ మాట్లాడుతూ ప్రత్యేకహోదా సంజీవని కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటున్నారని, కాని రాష్ట్ర యువతకు ఆశాదీపం ప్రత్యేకహోదానేనని ఆయన పేర్కొన్నాడు. ప్రత్యేకహోదాతోనే రాష్ట్రంలో యువత భవిష్యత్ ముడిపడి వుంది, హోదా వస్తే పరిశ్రమల కోసం చంద్రబాబు సింగపూర్, జపాన్, రష్యాలకు పోనవసరం లేదు. ఆ పరిశ్రమలే ఇక్కడికి వస్తాయి. ఎన్నికలప్పుడు బాబొస్తే జాబు అన్నారు. ఆయన రావడం తోటే ఉన్న జాబులు పోయాయి. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు నోటు కేసులో ఎప్పుడైతే చంద్రబాబు పట్టుబడ్డాడో, అప్పుడే ప్రత్యేకహోదాపై ఆశలు సన్నగిల్లాయని ఆయన అన్నాడు. చంద్రబాబును నమ్ముకుంటే ప్రత్యేకహోదా రాదని, జనమే ప్రభంజనమై ఉద్యమించాలని, ఈ ఉద్యమానికి తాను ముందుంటానని ఆయన చెప్పాడు.

ఈ సదస్సులో ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, వైకాపా నాయకులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన ఎస్పీ



ఈ నెల 3వ తేదీన నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ ఆధ్వర్యంలో 'మనం - వనం'లో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా జిల్లా పోలీస్ కార్యాలయాలలోనూ, అన్ని పోలీస్‌స్టేషన్‌లలోనూ ఇంకుడుగుంటలు తవ్వించడంతో పాటు విరివిగా మొక్కలు నాటిస్తున్నట్లు చెప్పారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణాలను, పోలీస్ కాలనీలను హరితమయం చేసేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఐదువేల మొక్కలు చొప్పున జిల్లా వ్యాప్తంగా 5లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని, మొక్కలు నాటడంలో జిల్లా పోలీస్‌శాఖను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శరత్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ సూరిబాబు, డిఎస్పీలు కోటారెడ్డి, చెంచురెడ్డి, ఆర్ఐలు శ్రీనివాసరావు, చిరంజీవి, త్రీటౌన్ సిఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.






## నెల్లూరులో..
## డా॥ అగర్వాల్స్ నేత్ర వైద్యశాల

గత మూడున్నర దశాబ్దాలుగా నెల్లూరులో కంటి వైద్య సేవల్లో విశేష ప్రతిభ చూపిన డాక్టర్ బి.శివప్రతాప్‌రెడ్డి, దేశవ్యాప్తంగా పేరెన్నికగన్న డాక్టర్ అగర్వాల్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు దర్గామిట్టలోని హోటల్ మినర్వా గ్రాండ్ సమీపంలో నిర్మించిన డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్‌ను ఈ నెల 9వ తేదీ ఉదయం 11గంటలకు ప్రారంభిస్తున్నారు. ప్రముఖ సినీనటి కుమారి రెజీనా, జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు, నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌లు ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారు. ఈ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసి తమ ఆశీస్సులు అందజేయాలని డాక్టర్ అదిల్ అగర్వాల్, డాక్టర్ బి.శివప్రతాప్‌రెడ్డిలు కోరుతున్నారు.

# డిఎస్‌డిఓగా రమణయ్య



జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా పి.వి.రమణయ్యను నియమిస్తూ శాప్ యం.డి రేఖారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన విజయవాడలోని శాప్ కార్యాలయంలో పరిపాలనా విభాగంలో పని చేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఒకటిన్నర నెల క్రితమే ఇక్కడకు డిఎస్‌డిఓగా వచ్చిన ఎ.బాలాజీని తిరుపతి సబ్‌సెంటర్ హాకీ కోచ్‌గా బదిలీ చేశారు.




## 'ప్రభా'తం

# గల్ఫ్‌లో.. బ్రతుకులు ఉఫ్

**దూరపు కొండలు నున్నగా వుంటాయని తెలియక.. ఆశపడి, పొట్ట చేత పట్టుకుని బతుకుతెరువు కోసం దూరదేశాలైన గల్ఫ్‌కు వెళ్తే అక్కడ సంక్షోభం ఆ కార్మికుల జీవితాలకే శాపంగా మారింది. అక్కడ భారీ కంపెనీలు సైతం మూతపడిపోతుండడంతో చివరికి పట్టెడన్నం కూడా దొరక్క భారతీయ కార్మికులెందరో పస్తులతో విలవిలలాడుతున్నారు. వారందరినీ కేంద్రం తక్షణం ఆదుకోవాలి. వలస కార్మికుల జీవితాల భద్రతకు-జీవనోపాధి పరిరక్షణకు శాశ్వతప్రాతిపదికపై గట్టి చర్యలు తీసుకోవాలి.**

'దూరపు కొండలు నునుపే'.. అన్నది పెద్దల మాట..అది నేటికీ అక్షరసత్యంగానే వుంది. కూటికోసం, కూలి కోసం.. పొట్టచేతపట్టుకుని గల్ఫ్‌దేశాలకు వలసలు వెళ్ళిన వేలాదిమంది కార్మికుల పరిస్థితి ఇప్పుడు సరిగ్గా అలాగే వుంది. కన్నవారినీ..ఉన్న ఊరినీ అందరినీ వదులుకుని జీవనోపాధి కోసం దూరదేశాలకు వెళ్ళిన వారికి ఇప్పుడు కష్టాలే ఎదురయ్యాయి. నమ్ముకున్న కంపెనీలు మూతపడిపోగా..చివరికి తినడానికి తిండి లేక కార్మికులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఎండిపోయిన రొట్టెముక్కలు దొరికితే వాటిని నీళ్ళలో అద్దుకుని ప్రాణాలు నిలుపుకునే దయనీయ పరిస్థితి కూడా ఎదురవుతోంది.. ఏ ఉపాధికోసమైతే వారు ఎన్నో వ్యయప్రయాసలు భరించి స్వదేశాన్ని విడిచి అంతదూరం వెళ్ళారో.. చివరికి అక్కడ ఆ ఉపాధే కరువైపోయి.. ఆకలితో నకనకలాడే దుస్థితి దాపురించడం ఎంత బాధాకరం.. ఎంత దురదృష్టకరం!..

అంతర్జాతీయ స్థాయిలో చమురు మార్కెట్‌లో పోటీ, అతిపెద్దదైన నిర్మాణ రంగం సైతం చతికిల పడిపోవడం లక్షలాది మంది కార్మికుల జీవితాలకు శాపంగా మారింది. చివరికి పట్టెడన్నం కూడా దొరక్క వేలాదిమంది కార్మికులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక కార్మికులు అల్లో రామచంద్రా అంటూ ఆకలితో అలమటిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లోని అనేక భారీ కంపెనీలు సైతం సంక్షోభ సుడిగుండంలో పడిపోవడంతో, ఆ కంపెనీలను నమ్ముకున్న లక్షలాదిమంది కార్మికుల భవిష్యత్తు నడిసముద్రంలో మునిగిపోయిన నావలా అయిపోయింది. ఇప్పుడెలా గట్టెక్కాలో తెలియని దీనపరిస్థితి వారిది. ఒక పక్క చమురు ధరలు భారీగా తగ్గిపోయి సంక్షోభం ఏర్పడడం, మరోవైపు అనేక ప్రాంతాల్లో ఉపాధి సౌకర్యాలు కనుమరుగు కావడం, యెమెన్ వంటి ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం ఏర్పడడం తదితర కారణాలతో గల్ఫ్ దేశాలు సంక్షోభంలో పడిపోయాయి.

గల్ఫ్ దేశాలకు వెళ్తే మంచి ఉపాధి దొరుకుతుందని భావించి, బతుకు తెరువు కోసం దూరదేశాలకు వెళ్లిపోయిన లక్షలాది మంది కార్మికులకు ఇప్పుడు భయంకర సంక్షోభమే ఎదురైంది. తినడానికి తిండి కూడా దొరకని ఈ కష్టాల్లో అక్కడ వుండలేక, తిరిగి ఇక్కడికి రాలేక వారు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. గల్ఫ్‌లో దాదాపు 70లక్షల మంది ప్రవాస భారతీయులు ఉన్నారు. ఒక్క సౌదీలోనే 30లక్షల మంది వరకు భారతీయులు ఉంటారని ఒక అంచనా. మన రాష్ట్రం నుంచి కూడా ఆ దేశాలకు ఇప్పటికే దాదాపు 10 లక్షలమంది దాకా వెళ్ళినట్లు అంచనా. ఏటా రాష్ట్రం నుంచి 50 వేల మందికి పైగానే ఉపాధి కోసం విదేశాలకు వలస వెళ్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా మన రాష్ట్రంలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కడప తదితర జిల్లాల నుంచి ఎక్కువమంది గల్ఫ్‌కు వలస వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఉపాధి లభిస్తుందనే ఆశతో గల్ఫ్‌కు వెళ్లినవారు ఇప్పుడక్కడ పరిస్థితులను చూసి బెంబేలెత్తిపోతున్నారు. సౌదీ అరేబియా, కువైట్‌లలో తీవ్రనష్టాలకు గురైన చమురు తదితర కంపెనీల్లో ఉద్యోగులను, కార్మికులను పెద్దసంఖ్యలో తీసివేస్తుండడం, నెలల తరబడి వారికి ఇవ్వాల్సిన జీతాలివ్వకుండాలనే పలు కంపెనీలు బోర్డులు తిప్పేస్తుండడంతో ఆయా కంపెనీలను నమ్ముకున్న కార్మికులంతా నట్టేట మునిగిపోతున్నారు.. వలస కార్మికుల పాస్‌పోర్ట్‌లు ఆయా కంపెనీల యాజమాన్యాల వారివద్దనో, లేదా ఏజెంట్ల వద్దనో వుండడంతో వారి బారి నుంచి బయటపడలేక కార్మికులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. గతంలో ఎన్నడూ లేనంతగా కనీవినీ ఎరుగని రీతిలో ముడిచమురు ధరలు తగ్గిపోవడం, రెండేళ్ళుగా ఆ సంక్షోభం అలాగే కొనసాగుతుండడంతో ఇక అక్కడున్న అనేక కంపెనీలు కోలుకునే పరిస్థితులు కూడా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో జెడ్డాలో భారతీయ కార్మికులు ఎక్కువగా పనిచేసే కంపెనీలు మూసివేయడంతో సుమారు పదివేల మందిదాకా భారతీయులు గత కొద్దిరోజులుగా ఆకలితో పస్తులుంటున్నారనే సమాచారం తెలుసుకున్న కేంద్రప్రభుత్వం వారికి వెంటనే ఆహారం అందించాలని సౌదీలోని భారత రాయబార కార్యాలయాన్ని ఆదేశించడంతో ఆ సమస్యకు కొంతమేరకు పరిష్కారం లభించినట్లయింది. జెడ్డాలోని తెలుగుసంఘం ప్రతినిధులు అక్కడివారికి ఆహారం అందించి మానవత్వం చాటుకుంటున్నారు. సౌదీలోనైతే భారత కార్మికుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా వున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక మాంద్యంతో కంపెనీలు మూతపడి కార్మికులు అన్నం కూడా దొరక్క అల్లాడుతుంటే, మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టు రకరకాల తనిఖీలతో మరిన్ని చిక్కుల్లో పడి సరైన పత్రాలు లేక ఎంతోమంది జైళ్ల పాలవుతున్నారు కూడా. ఏజెంట్లు చెప్పిన మాయ మాటలు నమ్మి కార్మికులు తమ పాస్‌పోర్ట్‌లను వారిచేతికే ఇవ్వాల్సి రావడంతో, ఇప్పుడు ఎటూ పోలేక అవస్థలు పడుతున్న వారు మరెంతమందో వున్నారు. ఈ నేపథ్యంలో గల్ఫ్‌లో బాధలకు గురవుతున్న భారతీయులను తిరిగి భారత్‌కు తీసుకువచ్చేందుకు కేంద్రం చేస్తున్న కృషి అపారం. ఏదేమైనా, గల్ఫ్‌లో కష్టాలు పడుతున్న భారతీయులందరినీ రక్షించేందుకు, వారిని అన్ని కష్టాల నుంచి గట్టెక్కించేందుకు కేంద్రప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

ఈ గడ్డు పరిస్థితులన్నిటినీ దృష్టిలో పెట్టుకుని, కార్మికుల అభ్యున్నతినీ-సంక్షేమాన్ని కాంక్షిస్తూ.. భవిష్యత్తులో ఇకపై విదేశాలకు ఉపాధి కోసం వెళ్ళేవారి జీవనోపాధికి సరైన భరోసా వుండేలా కేంద్రం-రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. ఆ మేరకు నియమ నిబంధనలను పటిష్టం చేయాలి. బతుకు తెరువు కోసం గల్ఫ్‌కు వెళ్ళినా.. చివరికి తినేందుకు తిండి కూడా దొరక్క రోజుల తరబడి పస్తులుండాల్సిన దయనీయ పరిస్థితి ఎవరికైనా సరే.. ఎదురుకావడం ఎంత దురదృష్టకరం!.. ఈ పరిస్థితులు ఇక ఏనాటికీ పునరావృతం కాకుండా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు మానవతా దృక్పధంతో ఆలోచించాల్సి వుంది. బతుకుతెరువు కోసం విదేశాలకు వెళ్లే వలస కార్మికుల సంక్షేమానికి, వారి జీవితభద్రతకు..జీవనోపాధి పరిరక్షణకు పటిష్టమైన..నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాల్సి వుంది.

# స్నేహిత్ ఫౌండేషన్ రక్తదానం



నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్ పేట శివాలయం సమీపంలో వున్న స్నేహిత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెల 31వ తేదీ రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో ఫౌండేషన్ సభ్యులు, వారి మిత్రులు దాదాపు 60మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా 8వ డివిజన్ కార్పొరేటర్ కిన్నెర ప్రసాద్, రక్తదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఆర్ స్కూలు పూర్వవిద్యార్థులు స్నేహిత్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తయిన సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు గుర్రం వెంకటేశ్వర్లు, కార్యదర్శి మామెండ్ల వెంకటసురేష్, కోశాధికారి అయితా వెంకట సురేంద్రబాబు, సభ్యులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాలో బాధితులు మహిళలే

**- నెల్లూరుజిల్లా జడ్జి జునైద్ అహ్మద్**




మానవ అక్రమ రవాణాలో అధిక భాగం బాధితులు మహిళలేనని, వారు అన్ని విషయాల పట్ల అవగాహనతో ఉండాలని నెల్లూరు జిల్లా జడ్జి మౌలానా జునైద్ అహ్మద్ అన్నారు. ఇటీవల నెల్లూరు డికెడబ్ల్యు కళాశాలలో న్యాయసేవాసాధికార సంస్థ, హెల్ప్ స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి సంతకాల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ నేటి యువత మానవ అక్రమ రవాణాపై అవగాహన పెంపొందించుకుని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఉండాలని సూచించారు. జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ కార్యదర్శి సత్యవాణి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాలో మహిళలు హింస, వేధింపులకు గురవుతూ వారి హక్కులను కోల్పోతున్నారని తెలిపారు. ఈ అక్రమ రవాణా వివిధ రూపాల్లో జరుగుతోందన్నారు. అవగాహన కార్యక్రమాల ద్వారా వీటిని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి ఛైర్మెన్ డాక్టర్ రమేష్, సిడబ్ల్యుసి సభ్యులు మురళీకృష్ణ, ఛైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి ఉపాధ్యక్షుడుగా గొట్టిపాటి

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా జలదంకి మండలానికి చెందిన గొట్టిపాటి శ్యాంసుందరనాయుడు నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకునిగా వున్న గొట్టిపాటి నియామకంతో ఆయన అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గొట్టిపాటికి ఈ పదవిని అప్పగించిన పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డికి, జిల్లా అధ్యక్షుడు పనబాక కృష్ణయ్యకు, ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెంచలబాబు యాదవ్‌కు పార్టీ మండలాధ్యక్షుడు శివశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

# కేంద్రం దగా!

ఆంధ్రప్రదేశ్‌కు మొన్నటి వరకు అధికారంలో వున్న యూపిఏనే కాదు, ప్రస్తుతం అధికారంలో వున్న ఎన్డీఏ కూడా ద్రోహం చేస్తున్నాయి. ఆరోజు సోనియాగాంధీ గుడ్డిగా రాష్ట్రాన్ని విభజించింది. ఏపితో తనకు సంబంధం లేదు, ఈ రాష్ట్రం ఈ దేశంలో భాగం కాదన్నట్లుగా వ్యవహరించింది. కాంగ్రెస్ సంగతి తెలిసిందే! మరి క్రమశిక్షణకు మారుపేరని చెప్పుకునే బీజేపీకి ఏమైంది. ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌ను చూసి జాలిపడి నరేంద్ర మోడీ కార్చిన కన్నీళ్లు ఏమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో మోడీని చూసే ప్రజలు చంద్రబాబుకు ఓట్లేసారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా అదనంగా ఇమ్మనడం లేదు. విభజన సమయంలో కాంగ్రెస్‌తో పాటూ బీజేపీ కూడా ప్రత్యేకహోదా హామీ ఇచ్చింది. ఈరోజు ఆ మాట మీద బీజేపీ నిలబడడం లేదంటే... బీజేపీ కన్నా కూడా కాంగ్రెస్సే కొంత మేలనిపిస్తోంది.

**- బి.వీరనాగిరెడ్డి, కలిగిరి.**




# హడావిడి పనులెందుకు?

కృష్ణ పుష్కరాలు ఉన్నట్లుండి వచ్చినవి కావు. ఏ నదికి ఏ సంవత్సరంలో పుష్కరాలొస్తాయన్నది అందరికీ తెలిసిన రహస్యమే. కృష్ణ పుష్కర ఘాట్ల నిర్మాణాన్ని ఆరు నెలల ముందు నుండే చేపట్టి ఉండవచ్చు. ఇప్పుడు అదరాబదరా పనులు కేటాయించి, వాటిని నాణ్యత లేకుండా చేయాల్సిన అవసరమేముంది. పుష్కరాల పనుల్లో వందల కోట్లు దిగమింగేందుకే ఇలాంటి పనులు చేస్తున్నట్లుగా వుంది.

**పల్లె శ్రీమన్నారాయణ, రాపూరు.**

# కార్పొరేషన్‌పై విసుగు

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పాలనపై ప్రజలకు కొద్ది కాలానికే విసుగు పుట్టింది. అవినీతి, అలసత్వం, రాజకీయ విభేదాలు, కొట్లాటలు, భవనాల కూల్చివేతలు, గబ్బు డ్రైనేజీ, ఏసిబి దాడులు... ఇత్యాది అంశాలు నగరపాలక సంస్థ పాలనను దిగజార్చాయి. కార్పొరేషన్‌ను గాడిలో పెట్టాలంటే 'పౌరసభ' నిర్వహించాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# నెల్లూరీయుడికి అత్యున్నత పోస్ట్ పోస్టల్ డిజిగా... సుధాకర్‌రావు



చదువుకు, సంస్కారానికి, ఆతిథ్యానికి, మేధస్సుకు, వ్యాపారానికి, రాజకీయానికి, కళారంగానికి... నెల్లూరీయులు ఎక్కడున్నా సెట్ అయిపోతారు. వాటిలో సెటిలైపోతారు. ఏ రంగంలో వున్నా కూడా నెల్లూరీయులు తమదైన ప్రత్యేక గుర్తింపును సాధిస్తూ, తాము పుట్టిన గడ్డకు కూడా గుర్తింపు తెస్తుంటారు. నెల్లూరు జిల్లా కీర్తిబావుటాను విశ్వవ్యాప్తంగా ఎందరో గొప్పవాళ్లు ఎగురవేస్తున్నారు. అలాంటి వారి జాబితాలో మరోవ్యక్తి చేరాడు. అతనే బోయపాటి సుధాకర్‌రావు.

కేంద్ర ప్రభుత్వ సర్వీసులలో టెలికాం, తపాలా అత్యంత ముఖ్యమైనవి. అలాంటి ఇండియన్ తపాలా శాఖలో అత్యున్నత పదవిని ఈరోజు నెల్లూరీయుడిగా సుధాకర్‌రావు చేపట్టారు. భారత తపాలాశాఖ సెక్రటరీ కం డైరెక్టర్ జనరల్‌గా నెల్లూరుజిల్లా కొడవలూరు మండలం కమ్మపాలెంకు చెందిన బోయపాటి సుధాకర్‌రావు నియమితులయ్యారు. 1981లో సివిల్స్ వ్రాసి ఇండియన్ పోస్టల్ సర్వీసెస్‌కు ఎంపికైన ఆయన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో వివిధ హోదాలలో విధులు నిర్వర్తించారు. తాను పనిచేసిన ప్రతిచోటా తపాలాశాఖ ద్వారా ప్రజలకు అందించాల్సిన సేవలను మెరుగుపరిచారు. తపాలా శాఖలో ఎన్నో వినూత్న మార్పులు తీసుకొచ్చారు. పోస్టాఫీసుల్లో కోర్ బ్యాంకింగ్, కంప్యూటరీకరణ వంటి విధానాలను ప్రవేశపెట్టి పనిని వేగవంతం చేశారు. కొరియర్ సర్వీసులకు ధీటుగా ఉత్తరాల బట్వాడాను వేగవంతం చేశారు. ఒకటిన్నర ఏడాది క్రితం ఢిల్లీలో పోస్టల్ సర్వీస్ బోర్డు మెంబర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. తన పనితీరుతో అచిరకాలంలోనే తపాలాశాఖ 32వ డైరెక్టర్ జనరల్ అయ్యారు. పదవులు చేపట్టడమే కాదు, చేపట్టిన బాధ్యతలకు న్యాయం చేయగలిగినప్పుడే ఆ పదవికి సార్థకత! ఈ పదవి ద్వారా తపాలా శాఖలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టి ప్రజల ప్రశంసలందుకోవాలని ఆశిస్తూ... సుధాకర్‌రావుకు అభినందనలు తెలుపుతోంది 'లాయర్'.

# చెత్తే... ఇక విద్యుత్



చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి చేసే ఓ ప్రైవేట్ కంపెనీతో నెల్లూరు నగరపాలకసంస్థతో పాటు కావలి, గూడూరు, ఆత్మకూరు మున్సిపాల్టీలు ఒప్పందం చేసుకున్నాయి. ఒక్క నెల్లూరులోనే రోజుకు 200టన్నుల చెత్త వస్తుంది. మిగతా మున్సిపాల్టీలలోనూ భారీగానే చెత్త ఉంటుంది. ఈ చెత్తనంతా అల్లీపురం సమీపంలోని 30ఎకరాల డంపింగ్ యార్డ్‌లో నిల్వ చేస్తారు. ఈ చెత్త నుండే రోజుకు నాలుగు మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. మరో 18 నెలల్లో ఈ ప్రాజెక్ట్ పూర్తవుతుందని ఈ కంపెనీ ప్రతినిధులు వెల్లడిస్తున్నారు.

# హై'కోర్టు'లో జడ్పీటీసీల బంతి

నెల్లూరుజిల్లాలో 8మంది జడ్పీటీసీల భవిష్యత్ బంతి ఈ రోజు హైకోర్టులో వుంది. హైకోర్టు నిర్ణయాన్ని బట్టే వాళ్లకు పదవులు ఉండడమా? ఊడిపోవడమా? అన్నది తేలుతుంది. 2014లో జరిగిన నెల్లూరు జిల్లా పరిషత్ ఎన్నికల్లో వైకాపా 31 జడ్పీటీసీలను గెలుచుకోగా, తెలుగుదేశంకు 15జడ్పీటీసీలు దక్కాయి. అయితే అప్పుడే అసెంబ్లీ ఫలితాలు వెలువడి తెలుగుదేశం అధికారంలోకి రావడంతో నెల్లూరు జడ్పీపై ఆ పార్టీ నాయకుల కన్ను పడింది. వైకాపా నుండి 8 మంది జడ్పీటీసీలు పి.నారాయణ రెడ్డి, కె.కవిత, ఎస్.పెంచలమ్మ, ప్రసాద్‌గౌడ్, టి.రమేష్, ఎం.విజేత, డి.భారతి, షేక్ సలీమ్, ఉషారాణిలు తెలుగుదేశంలోకి దూరారు. తమకు తగిన సంఖ్యా బలం కోసం అధికారపార్టీ నాయకులు మూడుసార్లు జడ్పీ ఛైర్మెన్ ఎన్నికను వాయిదా వేయించారు. మూడోసారి ఖచ్చితంగా ఎన్నికను జరపాల్సిందేనని ఎన్నికల సంఘం అదేశించడంతో మూడోదఫా ఎన్నిక పెట్టారు. జడ్పీటీసీలు చెరిసమంగా ఉండడంతో లాటరీ తీయగా వైకాపా అభ్యర్థి బి.రాఘవేంద్రరెడ్డి ఛైర్మెన్‌గా ఎన్నిక కావడం తెలిసిందే! తమ పార్టీ నుండి గెలిచి తెలుగుదేశంలో చేరిన జడ్పీటీసీలపై విప్ ధిక్కారం క్రింద చర్యలు తీసుకోవాలంటూ వైకాపా నేతలు జిల్లా కలెక్టర్‌గా వున్న శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన దీనిని బాగా నానబెట్టడంతో లాభం లేదని హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టు మళ్లీ కలెక్టర్ వద్దకే పొమ్మంది. శ్రీకాంత్ తర్వాత వచ్చిన జానకి విప్‌ను ధిక్కరించిన 8మంది జడ్పీటీసీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసిందే గాని, చర్యలు తీసుకోలేదు. దీంతో మళ్లీ వైకాపా నేతలు హైకోర్టును ఆశ్రయించారు. విప్ ధిక్కరణ నిర్ణయం హైకోర్టు పరిధిలోనే వుందని ఈమధ్య కావలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ కేసులో సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది. దీనినే వైకాపా న్యాయవాది హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విప్ ధిక్కరణ కేసును హైకోర్టే విచారిస్తోంది. అయితే ఈ కేసులో తీర్పు త్వరగా వస్తేనే ఫలితం వుంటుంది. అన్ని కేసులు మాదిరిగానే దీనిలోనూ జాప్యం చేస్తే, సభ్యుల పదవీకాలం కాస్తా ముగిసిపోతుంది.



# అటు మేయర్... ఇటు మయూర్

## నెల్లూరులో మారుతున్న రాజకీయం

# మధ్యలో మినిష్టర్

**ఆనం వాళ్లు... సూదిని దూర్చే సందిస్తే చాలు... దబ్బలాన్ని కాదు, ఏకంగా దూలాన్నే దూర్చేస్తారు. రాకీయాలలో అంతటి ఘటికులు వాళ్లు. తెలుగుదేశం పార్టీలో వాళ్లు చేరినరోజే అర్థమైపోయింది... ఆ పార్టీలో వున్న మిగతా నాయకులకు బ్యాండ్ పడుతుందని. ఈ వరుసలో ముందు నిలిచినవాడు మేయర్ అజీజ్!**

మున్సిపల్ మంత్రి నారాయణ ఏరికోరి వైసిపి నుండి గెలిచిన అజీజ్‌ను తెలుగుదేశంలోకి తెచ్చుకున్నాడు. తన పార్టీకి చెందిన డాక్టర్ జడ్.శివప్రసాద్ ఆ రోజున్న పరిస్థితుల్లో మేయర్‌గా గెలవడానికి ఛాన్సున్నా, మంత్రి ఆ అవకాశాలకు గండికొట్టి అజీజ్‌ను మేయర్ పీఠమెక్కించి, తెలుగుదేశంలోకి తీసుకున్నాడు. అజీజ్ కూడా 2015 చివరి దాకా మంత్రి నారాయణ మనిషిగానే మసలుకున్నాడు. ఈ ఏడాది ఆరంభంలో ఎప్పుడైతే ఆనం సోదరులు తెలుగుదేశంలో చేరారో అప్పుడే అజీజ్ పవర్ తగ్గడం మొదలైంది. ఆనం వివేకా, ఆనం రంగమయూర్‌లు బహిరంగంగానే అజీజ్‌పై విమర్శలకు తెరలేపారు. మంత్రి నారాయణ కూడా వారి నోటికి కళ్లెం వేసే ప్రయత్నం చేయలేదు.

ఇటీవల కార్పొరేషన్‌లో ఇద్దరు శానిటరీ ఉద్యోగుల బదిలీ ఇరు వర్గాల వారికి ప్రతిష్టాత్మకంగా మారడం జరిగింది. వారిద్దరే లక్ష్యంగా మేయర్ అజీజ్ లక్కీ డిప్ ద్వారా శానిటరీ ఉద్యోగుల బదిలీ ప్రక్రియను నిర్వహించారు. ఈ లక్కీ డిప్‌లో ఆనం వర్గీయులు ఇద్దరికీ చెత్తపోస్టులు వచ్చాయి. దీంతో ఆనం వర్గం మరోసారి మేయర్‌పై విమర్శల యుద్ధాన్ని తీవ్రం చేసింది.

కాగా, ఇటీవల కాలంలో మంత్రి వద్ద అజీజ్ కంటే ఆనం మాటకే పరపతి పెరగసాగింది. అజీజ్ ఒక డివిజన్ స్థాయి నాయకుడు. కాని, ఆనం వర్గంతో జిల్లా వ్యాప్తంగా రాజకీయ అవసరాలున్నాయి. కాబట్టి నారాయణ కూడా ఆనంకే విలువ ఇవ్వసాగాడు. ఈ నేపథ్యంలోనే ఆనం మాట విని, ఆ వర్గానికి చెందిన ఇద్దరు శానిటరీ ఉద్యోగులు తిరిగి వాళ్లు కోరుకున్న స్థానాలకు రాగలిగారు. ఇక తనతో మాట మాత్రం కూడా చెప్పకుండా ఏడుగురు సిటీ ప్లానింగ్ సిబ్బందిపై సస్పెండ్ వేటు వేయడాన్ని కూడా అజీజ్ జీర్ణించుకోలేకపోతున్నాడు. తనకు తెలియకుండానే కార్పొరేషన్‌లో అన్నీ జరిగిపోతుంటే ఇక తాను ఎందుకుండడం అన్నట్లుంది ఆయన పరిస్థితి. ఈ బాధంతా ఆయన మొన్న లోకేష్ ముందు కూడా వెళ్లగక్కాడు.

ఏదో కొంపలంటుకుపోయినట్లు మేయర్‌గా గెలిచీ గెలవగానే అజీజ్ తెలుగుదేశంలో చేరాడు. అదే వైకాపాలో ఉండుంటే ఆ గౌరవం, ఆ హోదా ఎక్కడికీ పోయేవి కావు. మున్సిపల్ మంత్రి సొంత నగరంలో ఆయన ప్రథమపౌరుడిగా వుంటూ తన హోదా, పరపతిని ఎంతగానో పెంచుకుని వుండేవాడు. తెలుగుదేశంలో ఇప్పుడు ఆ విలువ ఎక్కడుంది?

# ఏపికి ల్యాండ్ మార్క్... కృష్ణపట్నం పోర్ట్



మీడియా గార్డెన్‌లో వనం-మనం ప్రతిజ్ఞ చేస్తున్న జర్నలిస్టులు



ప్రసంగిస్తున్న సిఇఓ అనిల్

ఆంధ్రప్రదేశ్‌కే కృష్ణపట్నం పోర్ట్ ఒక ల్యాండ్ మార్క్‌గా మారిందని పోర్టు సిఇఓ ఎండ్లూరి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. జూలై 31వ తేదీన నెల్లూరులోని వివిధ మీడియా సంస్థల ప్రతినిధులు తమ కుటుంబసభ్యులతో కలిసి కృష్ణపట్నం పోర్టును సందర్శించారు. పోర్టు ప్రగతిని పరిశీలించారు. పోర్టు ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మీడియా గార్డెన్‌లో మొక్కలు నాటారు. పోర్టు డెక్‌లలో సముద్ర విహారం చేశారు. పోర్టులోని హోటల్ దసపల్లా సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. సిఇఓ అనిల్ మీడియా ప్రతినిధులతో, వారి కుటుంబసభ్యులతో ఎంతో స్నేహపూర్వకంగా గడిపారు. పోర్టు సాధించిన ప్రగతిని ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో వివరించారు. ఇతర దేశాలలో ఆంధ్రప్రదేశ్ అంటే ఎవరికీ తెలియదని, తమ రాష్ట్రంలో కృష్ణపట్నం పోర్టు వుందని చెబితే వెంటనే స్పందిస్తున్నారని, జపాన్ పర్యటనలో సైతం తనకు ఈ అనుభవం ఎదురైనట్లు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే చెప్పారని ఆయన వెల్లడించారు. 8ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో ఏమీ ఉండేది కాదని, కాని, ఈరోజు దక్షిణాసియాలోనే అతిపెద్ద పోర్టు అవతరించిందని, మా ఛైర్మెన్ చింతా విశ్వేశ్వరరావు, యం.డి శశిధర్, ఇతర సిబ్బంది కృషి, పట్టుదలతోనే దీనిని సాధించామన్నారు. ముంబై, చెన్నై, కొచ్చిన్, మంగళూరు, విశాఖ... ఈ పోర్టులన్నీ కూడా పెద్దపెద్ద నగరాలలో వున్నాయని, కృష్ణపట్నం పోర్టు ఒక్కటే ఒక గ్రామీణ ప్రాంతంలో నిర్మితమైందని, అయినా కూడా అంతర్జాతీయ ఖ్యాతి సాధించిందని చెప్పారు. ఏడేళ్ల క్రితం సింగపూర్ పర్యటనకు వెళ్లి అక్కడ వ్యాపారవేత్తలతో కృష్ణపట్నం పోర్టు పేరు చెబితే పేరే కామెడీగా వుందని వేళాకోలంగా మాట్లాడారని, ఈరోజు అదే పోర్టు నుండి సింగపూర్‌కు పెద్దఎత్తున ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్‌టాక్స్‌ను మినహాయిస్తే పోర్టు సెజ్‌లో కలప, జీడిపప్పు ప్రాసెస్ వంటి పరిశ్రమలు వచ్చే అవకాశముందన్నారు. దేశంలోని అన్ని పోర్టులకు 50ఏళ్లు, వందేళ్ల చరిత్ర వుందని, కాని కృష్ణపట్నం పోర్టు వయసు 8ఏళ్లేనని, అయినా మిగతా పోర్టులను మించిపోయిందని చెప్పారు. దేశంలోనే అత్యధిక సామర్థ్యం గల నౌకలు నేరుగా బెర్త్ వద్దకు రాగల సౌకర్యం కృష్ణపట్నంలోనే వుందని, లోడింగ్, అన్‌లోడింగ్‌ను అత్యంత తక్కువ సమయంలో పూర్తి చేస్తూ ఎగుమతి, దిగుమతిదారులకు ఎంతో సమయాన్ని, ఖర్చును ఆదా చేస్తున్నామన్నారు.

పోర్టు అంటే కాలుష్యం, ధుమ్ము, ధూళి అన్న అభిప్రాయం ఉంటుందని, కృష్ణపట్నం పోర్టులో అటువంటి వాతావరణం కనిపించనీయకుండా సివిఆర్ ఫౌండేషన్ ద్వారా కోటి మొక్కలను నాటుతున్నామన్నారు. దీనిని క్లీన్ పోర్టుగానే కాకుండా గ్రీన్ పోర్టుగా చేయడం కూడా తమ లక్ష్యమన్నారు. సివిఆర్ ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా చెట్ల పెంపకం, విద్య, వైద్యం వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పోర్టు పిఆర్ హెడ్ జి.వేణుగోపాల్ కూడా పాల్గొని ఈ కార్యక్రమాన్నంతా పర్యవేక్షించారు.

# నెల్లూరు కబుర్లు

## కృష్ణకు జిల్లా యంత్రాంగం

కృష్ణ పుష్కరాలు జరిగే పన్నెండు రోజులు నెల్లూరుజిల్లాలో పోలీసుస్టేషన్‌లు, పలు ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీగా ఉండబోతున్నాయి. పుష్కరాల బందోబస్తు నిమిత్తం జిల్లా నుండి 1800 మంది పోలీసు సిబ్బంది వెళుతున్నారు. స్టేషన్‌కు ఒకరిద్దరు కానిస్టేబుళ్లు మాత్రమే ఉండబోతున్నారు. ఎస్పీ నుండి ఎస్‌ఐ దాకా అధికారులకు కూడా పుష్కర విధులు కేటాయించారు. ఈ రెండు వారాలు జిల్లాలో ఎలాంటి సంఘటనలు జరిగినా పట్టించుకునే దిక్కుండదు. ఇక ఇతర శాఖలకు సంబంధించి జేసీ 2 సాల్మన్ రాజ్‌కుమార్, డిఆర్‌డిఏ పిడి లావణ్యవేణి, డ్వామా పిడి హరిత, రాజీవ్ విద్యామిషన్ పిఓ కనక నరసారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి రామచంద్రారెడ్డి, జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డి, తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, ఐటిడిఏ పిడి కమలకుమారి, సివిల్ సప్లయిస్ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పి.వెంకటసుబ్బయ్య, పౌరసంబంధాల శాఖ ఆర్‌జెడి షేక్ లాల్‌జాన్, డిపిఆర్‌ఓ మనోరంజన్‌లతో పాటు మరో 35మంది తహశీల్దార్‌లకు పుష్కరాల డ్యూటీలు పడ్డాయి. 8వ తేదీ నుండి 25వ తేదీ వరకు వీళ్లు పుష్కరాల విధుల్లోనే ఉండబోతున్నారు.

## సెలవులే సెలవులు

ఆగష్టు నెలారంభంలోనే విద్యార్థులకు సెలవులు దండిగా వచ్చాయి. జూలై 31వ తేదీ ఆదివారం సెలవు. జూన్ 1వ తేదీ విద్యాసంఘాల బంద్. 2వ తేదీ ప్రత్యేకహోదా కోసం వైసిపి బంద్. ఈ నెల 13, 14, 15తేదీలలోనూ వరుసగా మూడ్రోజులు సెలవులే! 13 రెండో శనివారం, 14ఆదివారం, 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం. ఈ వరుస సెలవుల మూలంగా హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, పూణే, ముంబై ప్రాంతాల్లో వున్న నెల్లూరీయులు సొంత ఊర్లకు రావడానికి, పోవడానికి రద్దీ పెరగడంతో బస్సులు, రైళ్లలో రిజర్వేషన్ దొరకడం కష్టతరంగా మారింది. సీజన్ బట్టి ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణీకుల జేబులను బాగానే పిండాయి.

## రంగనాథుని దర్శించుకున్న రోశయ్య



ఈ నెల 1వ తేదీన నెల్లూరొచ్చిన తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య నగరంలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయాన్ని దర్శించారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్, ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వేదపండితులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. రంగనాథస్వామి, అమ్మవార్లను, శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామిని ఆయన దర్శించి వేదపండితుల మహాశీర్వాదం తీసుకున్నారు.

## డిపిఆర్‌ఓ డ్రైవర్‌కు సత్కారం




నెల్లూరు సమాచార పౌరసంబంధాల శాఖలో డ్రైవర్‌గా పని చేస్తున్న జి.వెంకటేశ్వర్లు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా డిపిఆర్‌ఓ డిడి కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సన్మానం కార్యక్రమంలో డిడి లాల్‌జాన్, డిపిఆర్‌ఓ మనోరంజన్, డివిజనల్ పిఆర్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, హాస్టల్స్ ఎత్తివేత తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వామపక్షాల విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమణ తెలిపారు. సోమవారం నెల్లూరు కెవిఆర్ పెట్రోల్ బంకు సెంటరులో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, పిడిఎస్‌ఓ సంఘాల నాయకులు రాస్తా రోకో నిర్వహించారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పని కూడా చేయలేదన్నారు. పేద విద్యార్థులుండే వసతిగృహాలను ఎత్తి వేయడం దారుణమన్నారు. హాస్టల్స్‌లో ఉండే ఒక్కో విద్యార్థికి రూ.25లు ఏ విధంగా సరిపోతుందని ప్రశ్నించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మధు మాట్లాడుతూ పుష్కరాల పేరుతో ప్రభుత్వం కోట్లు ఖర్చు పెడుతూ విద్యార్థుల కడుపు కొడుతోందని ఆరోపించారు.

## మానవత్వానికి హద్దులు లేవు



జూలై 30వ తేదీన పింఛన్ మంజూరు చేసేందుకు ఓ వ్యక్తి నుండి 30వేలు లంచం తీసుకుంటూ జిల్లా ఆడిట్ అధికారి షణ్ముఖరెడ్డి, సీనియర్ ఆడిటర్ వహీద్‌బాషాలు ఏసిబికి దొరికిపోయారు. వీళ్లను పట్టుకున్నది నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో! అక్కడ ఏడాదిన్నర వయసున్న షణ్ముఖరెడ్డి పాపకు చికిత్స చేస్తున్నారు. ఆ పాప పరిస్థితి సీరియస్‌గా ఉందని ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్‌కు తెలిసింది. ఆయన మానవత్వంతో స్పందించారు. ఎవరైనా బ్రతికేది బిడ్డల కోసమే కదా! షణ్ముఖరెడ్డిని అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తే ఆ బిడ్డకు మెరుగైన వైద్యం కోసం పర్యవేక్షించడం కష్టమవుతుందని భావించిన డిఎస్పీ వారి అరెస్ట్‌ను వాయిదా వేశారు. ఉన్నతాధికారుల అనుమతితో సెక్షన్-41ఏ ప్రకారం వారికి నోటీసులు జారీ చేసి ఐదురోజుల తర్వాత విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. షణ్ముఖరెడ్డి తన పాపను తీసుకుని వేలూరులోని సిఎంసి ఆసుపత్రిలో చేర్పించారు. ఆ పాప ఆరోగ్యవంతురాలు కావాలని ఆశిద్దాం.

## చలమయ్యకు రోశయ్య పరామర్శ



నెల్లూరు విచ్చేసిన తమిళనాడు గవర్నర్ డా॥ కొణిజేటి రోశయ్య ఆదివారం సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానం వీధిలో వున్న తన బాల్య మిత్రుడు కె.వి.చలమయ్య స్వగృహానికి వెళ్లి అస్వస్థతతో వున్న చలమయ్యను పరామర్శించారు. గతంలో ఆర్థికమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెల్లూరు వచ్చిన సందర్భంలో కె.వి.చలమయ్య గృహాన్ని రోశయ్య సందర్శించి వున్నారు. ఆదివారం సాయంత్రం పది నిమిషాలు చలమయ్య స్వగృహంలో ఉండి వారి కుటుంబసభ్యుల్ని ఆప్యాయంగా పలకరించి తేనీరు సేవించారు.

## సింహపురి టైం మారింది



నెల్లూరుజిల్లా రైల్వే ప్రయాణీకులు సింహపురి ఎక్స్‌ప్రెస్ అని పిలుచుకునే సింహపురి ఎక్స్‌ప్రెస్ టైం మారింది. ఇంతకుముందు ఇది గూడూరులో రాత్రి 10.10 గంటలకు బయల్దేరి, నెల్లూరులో 10.40కు కదిలేది. సికింద్రాబాద్‌కు ఉదయం 8.35 గంటలకు కరెక్ట్‌గా వెళితే చేరేది. కాని అమావాస్యకు, పౌర్ణమికి తప్పితే ఇదెప్పుడూ టైంకు పోయేది కాదు. గంటా రెండు గంటలు ఆలస్యమయ్యేది. హైదరాబాద్‌లో పొద్దున్నే పనులు మీద పోయే వాళ్లకు ఇదే మాత్రం సౌకర్యంగా వుండేది కాదు. అందుకనే సింహపురి టైంను మార్చమని ఎప్పటి నుండో కోరుతున్నారు. ఎట్టకేలకు రైల్వే అధికారులు గూడూరు నుండి సికింద్రాబాద్‌కు వెళ్లే సింహపురి టైం మార్చారు. గూడూరులో సాయంత్రం 6.50 గంటలకు ఇది బయల్దేరి నెల్లూరుకు 7.18గంటలకు చేరుకుంటుంది. ఇక్కడ నుండి 7.20 గంటలకు బయల్దేరి పొద్దున 5.40 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. రాత్రి సికింద్రాబాద్ నుండి బయలుదేరి సింహపురి మాత్రం యథావిధిగా 10.55 గంటలకే వుంటుంది. హైదరాబాద్‌లో పొద్దున్నే దిగి కొంచెం ఆలస్యంగానైనా పనులు ముగించుకుని నెల్లూరుకు బయలుదేరే వాళ్లకు సౌకర్యంగా ఈ టైం వుంది.

## కొత్త కలెక్టర్... కొత్త బండి



జిల్లాకు కొత్త కలెక్టర్ కాదు, ఆ కొత్త కలెక్టర్‌కు కొత్త కారు కూడా వచ్చింది. ఇంతకుముందు కలెక్టర్ శ్రీమతి జానకి ఇన్నోవా వాహనం వాడేవారు. ఆమె ఉండగానే ఇంట్రస్ట్ నిధులతో మహీంద్రా ఎక్స్‌యువి వాహనాన్ని కొనుగోలు చేశారు. ఇప్పుడు ఆ బండిని కొత్త కలెక్టర్ ముత్యాలరాజుకు కేటాయించారు.

### కలెక్టర్ కారే 108

ఆపదలో వున్న వ్యక్తిని ఆదుకోవడానికి 108 నెంబరున్న అంబులెన్స్ రానవసరం లేదు, ఏ నెంబర్ వున్న వాహనమైనా చాలని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు నిరూపించారు. జూలై 30వ తేదీన నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి గుడి ప్రాంతంలో బైక్ అదుపుతప్పి పడిపోయి బండి నడుపుతున్న వ్యక్తి గాయపడ్డాడు. ఆ సమయంలో అటుగా ఎన్నో వాహనాలు వెళుతున్నాయి. ఎవరూ ఆపలేదు. ఇలాంటివి జరిగినప్పుడు కొంచెం మానవత్వమున్నోళ్లు 108కి ఫోన్ చేసి అంబులెన్స్‌ను పిలిపిస్తుంటారు. అంతేగాని సొంత కార్లలో ఎక్కించుకుని ఆసుపత్రులకు తీసుకుపోలేరు. కాని అప్పుడే అటుగా వచ్చిన కలెక్టర్ ముత్యాలరాజు అంబులెన్స్ కోసం చూడలేదు. గాయాలపాలైన ఆ వ్యక్తిని వెంటనే తన కారులో ఎక్కించి పెద్దాసుపత్రికి చేర్పించి వైద్యం చేయించారు. సాధారణంగా ఇలాంటి సీన్‌లను సినిమాలలో చూస్తుంటాం. నిజ జీవితంలోనూ ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఇలాంటి కలెక్టర్లు కూడా ఉంటారని ముత్యాలరాజును చూసి తెలుసుకున్నాం.

## నెల్లూరుకు పెళ్లి కళ

ఈ నెల 3వ తేదీ నుండి శ్రావణ మాసం వచ్చేసింది. ఇది పెళ్లిళ్ల సీజన్. ఈ నెలంతా ఎక్కడ వట్టినా వేద మంత్రాలు, మంగళవాయిద్యాల సందడే! శ్రావణ మాసంలో నెల్లూరు నగరంలోనే వందల సంఖ్యలో వివాహాలు జరుగనున్నట్లు ఆయా కళ్యాణ మండపాలలో బుక్ అయిన పెళ్లిళ్ల వివరాలను బట్టి తెలుస్తోంది. కళ్యాణ మండపాలతో పాటు హోటల్స్‌లో గదులకు, గెస్ట్‌హౌస్‌లకు డిమాండ్ ఎక్కువగా వుంది. నగరంలోని కళ్యాణ మండపాలన్నీ కూడా ఈ శ్రావణ మాసమంతా విద్యుత్ దీపకాంతులతో మెరిసిపోనున్నాయి.

### ప్లేగ్రౌండ్‌గా... పోలీస్‌గ్రౌండ్




నెల్లూరులోని పోలీస్ పరేడ్ మైదానం క్రమక్రమంగా క్రీడా మైదానంగా మారుతోంది. ఇప్పటికే ఇక్కడ షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ కోర్టులున్నాయి. తాజాగా క్రికెట్ పిచ్, ఫుట్‌బాల్ కోర్టుల ఏర్పాటుకు ఎస్పీ విశాల్‌గున్నీ శ్రీకారం చుట్టారు. గత డిజిపి జె.వి.రాముడు గత నెలలో నెల్లూరులో పర్యటనకు వచ్చినప్పుడు వీటి నిర్మాణానికి 30లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఆ నిధులతోనే ఓ కాంట్రాక్టర్ ద్వారా ఈ పనులు మొదలుపెట్టించారు.

### శ్రీ రంగని ఆలయానికి విదేశీ భక్తుల విరాళం

నెల్లూరులోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ రంగనాథాలయాన్ని ఇటీవల నూరు మంది విదేశీ భక్తులు సందర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ దుబాయ్ వర్కర్ క్యాంప్ కో-ఆర్డినేటర్ జగజ్జన జగన్నాధ దాస్ మాట్లాడుతూ, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న భారతీయులతో పాటు, విదేశీయులకు హైందవ సంస్కృతిని, సంప్రదాయాలను వివరించి వారిలో ఆధ్యాత్మిక చింతనను, భక్తి భావనను పెంపొందించేందుకు ఇలా ఆలయ సందర్శనను చేపట్టామన్నారు. ఈ సందర్భంగా జగన్నాధాచార్యులు శ్రీ రంగనాధుని ఆలయానికి 50 వేల రూపాయలను కానుకగా సమర్పించుకుంటూ ఆ మొత్తాన్ని ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకరరావు, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అందజేశారు.

# ఎవరి పాపం... ఎవరికి శాపం

## అవినీతి, అక్రమాల పరంపరలో బలవుతున్నది అధికారులు



"పోలీసోడిని ట్రాన్స్‌ఫర్ చేస్తే... పోలీస్ స్టేషన్‌కే పోతాడు, రైల్వేస్టేషన్‌కు పోడు" ఓ సినిమాలో హీరో రవితేజ డైలాగ్ ఇది! నిజమే ఇది... పోలీసులు ఎక్కడైనా పోలీస్ స్టేషన్‌లోనే పని చేయాలి, రెవెన్యూ సిబ్బంది ఎక్కడైనా రెవెన్యూ కార్యాలయాల్లోనే పని చేయాలి, మున్సిపల్ సిబ్బంది కూడా ఏ మున్సిపాల్టీలోనైనా పని చెయ్యాలి! ప్రజల సొమ్మును జీతంగా తీసుకునే ఏ ఉద్యోగి అయినా సరే, ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ చేసినా పని చేయడానికి సిద్ధపడితే రాజకీయ అరాచకాలకు చెక్‌పడుతుంది. కాని ఉద్యోగులు ఎప్పుడైతే తమకు నచ్చిన పోస్టింగ్‌ల కోసం, లంచాలు ఎక్కువ వచ్చే సీట్ల కోసం నాయకుల బూట్లను ఎప్పుడైతే తుడుస్తారో అప్పుడు వారి స్వాతంత్ర్యానికి మూడినట్లే!

నెల్లూరు నగరపాలక సంస్థలో ఇలా పాలకులు ఆడిన ఆటకల్లా తాళం వేయబట్టే ఏడుగురు టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై వేటుపడింది. పాలకులు చేసిన పాపంలో భాగం పంచుకున్నందుకుగాను అధికారులు మొదటి బలిపశువులయ్యారు.

నెల్లూరులో అక్రమ కట్టడాల కూల్చివేత వ్యవహారం ఇటీవల పెద్ద దుమారాన్నే రేపింది. మంత్రి నారాయణ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్రమ భవనాల కూల్చివేతకు బయలుదేరడం, ఆ తర్వాత రాజకీయ ఒత్తిళ్లతో అది ఆగిపోవడం తెలిసిందే! 2015 నుండి ఆన్‌లైన్‌లో మంజూరు చేసిన నిర్మాణ అనుమతుల్లో అక్రమాలు చోటుచేసుకున్న విషయం విధితమే! నగరంలో ఈ విధంగా 300 భవనాలను గుర్తించారు. అయితే ఈ అక్రమ కట్టడాలు కేవలం భవన యజమానుల వల్లే వచ్చినవి కావు. పాలకులు, సిటీ ప్లానింగ్ సిబ్బంది భరోసాతో వెలిసినవే! ఏ భవన యజమాని నుండి ఎవరెవరికి ఎంత ముట్టిందన్న లెక్కలు కూడా బయట పడుతున్నాయి. బిల్డర్ల నుండి భారీ ఎత్తున లంచాలు మింగారు. ఇందులో పాలకులకు ప్రధాన వాటా రాగా, సిటీ ప్లానింగ్ సిబ్బందికి రావాల్సిన మామూళ్లు కూడా వచ్చాయి.

నగరంలో భారీ ఎత్తున అక్రమ కట్టడాలు వెలుగుచూసే సరికే మంత్రి నారాయణ మొదట వీటిని కూల్చాలనుకున్నాడు. ఆ తర్వాత ఆ పని విరమించుకుని భవన యజమానులకు భారీ పెనాల్టీలతో నోటీసులు పంపారు. ఇదంతా ఒకెత్తయితే జరిగిన అక్రమాలన్నింటికి హోల్‌సేల్ శిక్షగా ఏడుగురు సిటీ ప్లానింగ్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. వీరి స్థానాలలో వెంటనే కొత్తవారిని కూడా పెట్టారు. ఈ చర్యతో సిటీ ప్లానింగ్ సిబ్బంది ఖంగు తిన్నారు. పాపం చేయమన్నది ఒకరు, పాపాల్ని చూడకుండా పొమ్మనది ఒకరు... మరి మధ్యలో మాకేంటి శిక్ష అని వాళ్లు బాధపడుతున్నారు. మరి తప్పులను అరికట్టాల్సిన బాధ్యత వీరిదే! ఒక వ్యక్తిని ఇంకో వ్యక్తి కొడుతున్నప్పుడు, తప్పు కొడుతున్న వ్యక్తిదే కాదు, దానిని చూస్తూ ఆపని వ్యక్తిది కూడా! పాలకులు ఐదేళ్లుంటారు, పోతారు. కాని రిటైరయ్యే దాకా ఉద్యోగాలు చేసేది వీళ్లు. కాబట్టి పాలకులకంటే రూల్స్‌ను తమ బాస్‌గా భావించి వీళ్లు పనిచేస్తే ఇలాంటి బాధలు తప్పుతాయి.

# సింహపురిలో న్యూరో నావిగేషన్



న్యూరో నావిగేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కామినేని శ్రీనివాస్

నెల్లూరులోని సింహపురి సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూరో నావిగేషన్ వైద్య పరికరాన్ని ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ నేత కందుకూరి సత్యనారాయణ సతీమణిని పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో వైద్య చికిత్సలను మెరుగు పరుస్తున్నట్లు వివరించారు. దేశంలోనే పేదలకు అత్యుత్తమ వైద్యం అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి పేదవాడు ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందేలా తగిన సూచనలు ఇచ్చామన్నారు. సింహపురి ఆసుపత్రి సేవలు అభినందనీయమన్నారు. కొత్తగా ప్రారంభించిన న్యూరో నావిగేషన్ వైద్యపరికరం వల్ల క్లిష్టమైన శస్త్ర చికిత్సలు సైతం సులువుగా చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహపురి ఆసుపత్రి ఎండి కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, సిపివో నాగేంద్రప్రసాద్, బలరాం, బీజేపీ నాయకులు ఆంజనేయ రెడ్డి, సురేంద్రరెడ్డి, కందు కూరి సత్యనారాయణ, భాస్కరగౌడ్, ప్రముఖ న్యూరో సర్జన్ వెంకటేశ్వర ప్రసన్న, గుండె వైద్య నిపుణుడు భక్తవత్సలరెడ్డి, న్యూరో ఫిజిషియన్ దీక్షాంతి నారాయణ్ పాల్గొన్నారు.

### స్వచ్ఛభారత్‌లో...

# నెల్లూరు రైల్వేస్టేషన్ నెం.1

- దేశంలో 28వ స్థానంలో




స్వచ్ఛభారత్‌లో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఇది మనకు మనం తగిలించుకున్న ఘనత కాదు. కేంద్రం నుండి వచ్చిన ప్రత్యేక బృందం పరిశీలించి ఇచ్చిన సర్టిఫికేట్ ఇది. దేశంలో 407 ప్రధాన రైల్వేస్టేషన్‌లను కేంద్ర బృందం పరిశీలించింది. వారి పరిశీలనలో నెల్లూరు రైల్వేస్టేషన్‌లో పరిశుభ్రత నిర్వహణకు మంచి మార్కులే పడ్డాయి. నెల్లూరు రైల్వేస్టేషన్ ఏపిలో మొదటి స్థానంలోనూ, దేశంలో 28వ స్థానంలోనూ నిలిచింది.




# నిను వీడని నీడను నేనే...

- వీఎస్‌యుని వదలని వివాదాలు
- తాజాగా వెబ్‌సైట్ హ్యాకింగ్

*అక్రమాల పుట్టగా వివాదాల గుట్టగా మారిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాన్ని నిత్యం ఏదో ఒక వివాదం వెంటాడుతూనే వుంది. ఇష్టారాజ్యంగా సిబ్బంది నియామకాలు, అనర్హులకు అందలాలు, నిబంధనలకు విరుద్ధంగా భవనాల కాంట్రాక్ట్ కేటాయింపులు, సిబ్బంది కొరత, హాస్టళ్ల మూత, విద్యార్థి సంఘాల ఆందోళనలతో ప్రతిరోజూ పతాక శీర్షికల్లో ఉండే వీఎస్‌యు తాజాగా మరో సంచలనానికి వేదికైంది.*

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్ www.simhapuriuniv.ap.inను తీవ్రవాదులు హ్యాక్ చేయడం సంచలనం కలిగించింది. ఈ వెబ్‌సైట్‌లో యూనివర్శిటీ మరియు విద్యార్థుల సమాచారంతో పాటు, యూనివర్శిటీ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం పరీక్షల ఫలితాలుంటాయి. బెంగుళూరుకు చెందిన 'శ్రీవా టెక్నాలజీస్' సంస్థ ఈ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తోంది. జూలై 31వ తేదీన ఈ వెబ్‌సైట్‌ను హ్యాకింగ్ చేసినట్లు కొందరు విద్యార్థులు గుర్తించి వి.సి వీరయ్య, రిజిస్ట్రార్ శివశంకర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. వాళ్లు వెంటనే బెంగుళూరులోని 'శ్రీవా టెక్నాలజీ' వారితో మాట్లాడారు. వాళ్లు వెంటనే రంగంలోకి దిగి ఈ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించారు.

వెబ్‌సైట్‌ను హ్యాకింగ్ చేసిన పాక్ ప్రేరేపిత తీవ్రవాదులు అందులోని హోమ్ పేజీపై భారత వ్యతిరేక సందేశాలను పొందుపరిచారు. భారతీయులు కాశ్మీర్‌ను ఆక్రమించారని, కాశ్మీర్‌లో జరుగుతున్న అల్లర్లలో సైనికులు దారుణంగా వ్యవహరిస్తున్నారని, అత్యాచారాలకు, అరాచకాలకు పాల్పడుతున్నారని, కాశ్మీరీలకు అన్నదమ్ముల్లా అండగా ఉంటామని హెచ్‌ఇఎక్స్ 786 పేరుతో ప్రకటించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ, బాలీవుడ్ స్టార్ షారూఖ్‌ఖాన్‌ల ఫేస్‌లను పెల్లెట్స్‌తో గాయపరిచినట్లుగా చిత్రించి ఈ వెబ్‌సైట్‌లో పెట్టారు. పాకిస్థాన్‌కు చెందిన హ్యాకింగ్ గ్రూప్ ఈ వెబ్‌సైట్‌పై దాడికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యువతను తీవ్రవాదం వైపు ఆకర్షించే ప్రయత్నాలలో భాగంగానే వివిధ విద్యాసంస్థల వెబ్‌సైట్లను తీవ్రవాదులు లక్ష్యంగా చేసుకుంటున్నారు.

వీఎస్‌యు వెబ్‌సైట్ హ్యాకింగ్ గురికావడం కొత్తేమీ కాదు, రెండేళ్ల క్రితం యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను మహారాష్ట్ర, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన నకిలీ సర్టిఫికేట్ ముఠాలు హ్యాక్ చేశాయి. దీనిద్వారా ఆ సంస్థ భారీగా నకిలీ సర్టిఫికెట్లను తయారు చేయడం, అవి వెలుగులోకి రావడం, పోలీసు విచారణ చేపట్టడం జరిగింది.

# సర్వే వాహనం ప్రారంభం




ఆర్ అండ్ బి రోడ్ల సర్వే చేసే వాహనాన్ని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు సోమవారం తన కార్యాలయం నుండి జెండా వూపి ప్రారంభించారు. జిల్లాలో ఈ వాహనం ఆర్ అండ్ బి రోడ్లకు సంబంధించి రోడ్ల పరిస్థితులను, వంపులను అత్యాధునికమైన జిటాగ్ విధానంతో మ్యాపింగ్ చేయనుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేని నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ సర్వేను హైదరాబాద్‌కు చెందిన ఐఆర్ఎస్ఎం సంస్థ నిర్వహిస్తోంది. ఈ సర్వే టీమ్ సాంకేతిక నిపుణులు కిషోర్ మాట్లాడుతూ ఈ వాహనం రోజుకి 120 నుండి 150 కిలోమీటర్ల రోడ్డును పరిశీలించి డేటాను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయడం జరుగుతుందని తెలియజేశారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



చిల్లకూరు మండలం వరగలి, వల్లిపేడులలో కోటి 40 లక్షలతో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలను ప్రారంభించిన మంత్రి కామినేని శ్రీనివాసరావు, ఎం.పి వరప్రసాద్‌రావు, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఆర్డీవో, డిఎంహెచ్‌వో, అధికారులు, ప్రజాప్రతినిధులు

# వైద్య సేవలు మెరుగుపడాలి

**- జిల్లా కలెక్టర్**

గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో ఇప్పుడున్న పరిస్థితి కంటే మెరుగైన వైద్యసేవలు ప్రజలకు అందించడమే ప్రధానమని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు తెలిపారు. ఆయన గూడూరు ప్రాంతీయ వైద్యశాలను ఇటీవల రెండు గంటల పాటు నిశితంగా పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. రెండు నెలల్లోగా రోగులకు సేవలు ఇక్కడే అందించేలా ప్రత్యేకంగా నోడల్ అధికారిని జేసీ-2 రాజ్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు చెప్పారు. వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ ఉమ ద్వారా పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుంటే వైద్యశాఖలో తీసుకొనే జీతానికి 10శాతం కూడా పని చేయడం లేదు, చిన్న లోపాలను చూపి కాలయాపన చేస్తున్నారు తప్ప నిజాయితీగా పని చేయడం లేదన్నారు. గూడూరు ఏరియా ఆసుపత్రికి రోజుకు 200మంది రోగులు వస్తుండగా ఓపిలో 10మందికి ఎన్టీఆర్ వైద్యసేవలు చేయక పోవడం ఎక్సరే యూనిట్ పని చేయక పోవడం, 6నెలల కిందట ప్రారంభించిన సిటీ స్కాన్ కనీసం ఆరుగురిని కూడా పరీక్షించక పోవడం నిర్లక్ష్యానికి పరాకాష్టని అన్నారు. ఆయన వెంట డీసీహెచ్ఎస్ డాక్టర్ సుబ్బారావు, ఆర్ఎంవో శైలజ, జేసీ-2 రాజ్‌కుమార్, ఆర్డీవో వెంకట సుబ్బయ్య, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఈదూరు సుధాకర్, గోపీనాథ్, జేడీ రాజేంద్రప్రసాద్, ఐసిడిఎస్ సిడిపివోలు, గూడూరు తహశీల్దార్ సత్యవతి, ఎంపిడివో భవాని తదితరులు పాల్గొన్నారు.



ప్రాంతీయ వైద్యశాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

## గూడూరు డివిజన్ వార్తలు

# అఖిలపక్షం ఆందోళన విజయవంతం







రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పించాలన్న డిమాండ్‌తో అఖిలపక్షం ఆధ్వర్యాన మంగళవారం గూడూరులో సిపిఎం, సిపిఐ, వైకాపా, కాంగ్రెస్ పార్టీల నాయకులు ముక్తకంఠంతో నినాదాలు చేశారు. ఉదయాన్నే కాంగ్రెస్, వైకాపా, వామపక్షాల నాయకులు, కార్యకర్తలు జెండాలను చేతపట్టి పట్టణంలోని రోడ్లపైకి వచ్చారు. ఈ సందర్భంగా దుకాణాలను మూయించారు. ప్రత్యేకహోదా ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరిపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ డిపో వద్ద బస్సులను అడ్డుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సులు యధావిధిగా నడిచాయి. దుకాణాలు కూడా తెరుచుకున్నాయి. ఈ బంద్‌లో వామపక్షాల నాయకులు యాదగిరి, కేశవులు, ముత్యాలయ్య, సివిఆర్ కుమార్, వైకాపా నాయకులు మేరిగ మురళీ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బత్తిన విజయకుమార్, మగ్దూమ్, మొహిద్దీన్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కె.మునిగిరీష్, గోపాలయాదవ్, అన్వర్‌భాషా, ముత్యాలయ్య, రవీంద్రరెడ్డి, జిలానీ భాషా, కిషోర్ కుమార్, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సేవా సంఘం 'వనం - మనం'



మొక్కలను నాటుతున్న గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం

వనం-మనంలో భాగంగా గూడూరు హనుమంతరావు నగర్‌లో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు 4లక్షల మొక్కలు రాష్ట్ర వ్యాప్తంగా నాటే కార్యక్రమంలో భాగంగా చెట్లను నాటారు. పై కార్యక్రమంలో అధ్యక్ష ఉపాధ్యక్ష కార్యదర్శులు వై.చలపతిరావు, ఆనిమెళ్ళ శివకుమార్, చిట్టమూరు శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుడు దూబగుంట బాలశ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గుతుందని, వర్షాలు బాగా పడతాయని, ఇట్లాంటి కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా తీసుకొన్న ముఖ్యమంత్రికి అభినందనలు తెలియజేస్తూ, నాటిన మొక్కలను రక్షిస్తామని ప్రమాణం చేశారు.

# కాలుష్య నివారణకు మొక్కలే ఆధారం



మొక్కలు నాటుతున్న షేక్ రియాజ్ అహ్మద్, రహీం తదితరులు

కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొక్కలే ఆధారమని, మానవాళి మనుగడ తద్వారా సాధ్యమని మహమ్మదీయన్ వెల్‌ఫేర్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రహీం తెలిపారు. ఆ నెట్‌వర్క్ ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలో పెద్ద మసీదు సమీపంలో వున్న ఈద్గాలో షేక్ రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో మొక్కలను నాటాలని పిలుపు నిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడమే శరణ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెట్‌వర్క్ ప్రతినిధులు మహ్మద్ రఫీ, ఫజల్ ఆలీ, రహంతుల్లా, ఇస్మాయిల్, మహబూబ్ భాషా, మున్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో కో-ఆప్షన్ ఎన్నిక



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరు పురపాలక సంఘంలో కో-ఆప్షన్ ఎన్నికను త్వరలోనే నిర్వహిస్తున్నట్లు పురపాలక ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. పురపాలక సంఘం కార్యాలయంలో ఇటీవల కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డుల్లోని సమస్యలను అనేక పర్యాయాలు తీసుకువచ్చినా పరిష్కరించుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు. అజెండాలోని అంశాలను ఆమోదించారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, వివిధ పార్టీ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవాన్ని

# ఘనంగా నిర్వహించాలి

**- జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్**



స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్‌సెల్ సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు, శకటాల ఏర్పాటు చేయడానికి డిఆర్‌డిఏ పిడి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆత్మగౌరవం కార్యక్రమంపై ఒక స్టాల్‌ను ఏర్పాటు చేయాలని జేసీ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీహరికోటలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్

షార్ ఉద్యోగులకు రైల్వే రిజర్వేషన్ కౌంటర్ అందుబాటులోకి వచ్చింది. మొన్నటిదాకా రిజర్వేషన్ కోసం సూళ్ళూరుపేటకు వెళ్ళాల్సివచ్చేది. ఇకనుంచీ ఆ ఇబ్బంది లేకుండా శ్రీహరికోటలోని తపాలా బ్రాంచ్ కార్యాలయంలో ప్రత్యేకంగా రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రారంభించారు. సోమవారం షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్ రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రారంభించి మాట్లాడుతూ, షార్ ఉద్యోగులకు శ్రీహరికోటలోనే రైల్వే రిజర్వేషన్ చేయించుకునే వెసులుబాటు కలగడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ జెవి రాజారెడ్డి, రైల్వే కమర్షియల్ అధికారి సుందర్, పోస్టల్ సూపరింటెండెంట్ డి. రమణయ్య, ఇన్‌ఛార్జి సుధాకర్, ఇన్‌స్పెక్టర్ సిహెచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి

**- గోపాల్ యాదవ్**

నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పనిచేసి కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరబోయిన గోపాల్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని వలయానందపురంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కొత్తగా నియమింపబడిన కమిటీ సభ్యులు ప్రణాళికలను రూపొందించుకొని పార్టీని ప్రజలకు చేరువచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి కె.మునిగిరీష్, నాయకులు ముర్తుజా, జిలానీ భాషా, రవీంద్రరెడ్డి, రఫీ, కిషోర్, వెంకటేశ్వర్లు, ముత్యాలయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



పనబాక కృష్ణయ్య నుండి నియామకపత్రాన్ని అందుకుంటున్న గోపాల్

గల్పిక

# టెన్ జనపథ్‌లో క్షుద్రపూజలు

ఢిల్లీలోని టెన్‌జనపథ్. లోపలంతా మామిడి, వేప మండలతో తోరణాలు కట్టి వున్నాయి. ఇంటికి అన్ని మూలల్లో పసుపు, కుంకుమ చల్లిన నిమ్మకాయలు పెట్టి వున్నారు. హాల్‌లో భూతవైద్యుడు డెవిల్స్ డేవిడ్ రాజు చేతిలో వేప మండలు వూపుతూ... ఏయ్... శాకిని, ఢాకిని, మందాకిని... జంబోల జంబో... లంబోలపంబ... ఓహో, జగన్మోహని, కాంచన, అరుంధతి, త్రిపుర... హీం... ధూమ్... అంటూ పెద్దగా మంత్రాలు చదువుతున్నాడు. ఆయన ముందు ఒక ముగ్గేసి, అందులో నిమ్మకాయలు ఉంచారు. ఆయనకు ఎదురుగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కూర్చుని ఉండగా మన్మోహన్‌సింగ్, దిగ్విజయ్‌సింగ్, దాసరి జైరాం రమేష్, గులాంనబీ ఆజాద్, చిదంబరం, అంబికాసోని, మనీష్ తివారి, మల్లిఖార్జున ఖర్గే వంటి నాయకులు నిలబడి ఉన్నారు. అప్పుడే అక్కడకు కె.వి.పి.రామచంద్రరావు వచ్చాడు. అదంతా చూసి ఏంటి సార్, ఇదంతా అని దిగ్విజయ్‌సింగ్‌ను అడిగాడు. అందుకాయన... గత రెండున్నరేళ్లుగా మేడమ్ కుటుంబానికి ఏమీ బాగా లేదు. ఉన్న అధికారం పోయింది, మేడమ్‌కు ఆరోగ్యం బాగుండడం లేదు, అల్లుడు రాబర్ట్‌వాద్రా మీద కేసులు పడ్డాయి, రాహుల్‌బాబును చూస్తే ఎక్కడా కుదురుగా ఉండడం లేదు. ఇంట్లో చెప్పా పెట్టకుండా విదేశాలకు వెళ్లిపోతుంటాడు. పెళ్లి చేసి కొత్త కోడలన్నా ఇంట్లో అడుగుపెడితే పరిస్థితులు మారుతాయనుకుంటే రాహుల్‌కు పెళ్లి ఆలోచనే లేకుండా పోయింది. అసలు ఈ ఇంటికేదో అయ్యింది. ఓ పక్క బాధ... ఇంకో పక్క అధికారం లేని వ్యథ... తమనేవో గ్రహాలు పట్టి పీడిస్తున్నాయని మేడమ్‌కు అనుమానం వచ్చింది. ఆమె తన అనుమానమంతా నాతో చెప్పింది. అందుకే నేనే భూతవైద్యుడిని పిలిపించి ఈ తంతు పెట్టించానని చెప్పాడు.

ఈలోపు అక్కడ డెవిల్స్ డేవిడ్‌రాజు నోట మంత్రాలు తారాస్థాయికి చేరాయి. ఒసేయ్ త్రిపుర... దమ్ముంటే నా ముందుకు రావే... ఒసేయ్ కాంచన... నీకు ధైర్యముంటే నా ముందు నిలబడే... అని తొడకట్టి ఛాలెంజ్ చేస్తున్నాడు. అతని అరుపుల ధాటికి అక్కడున్న వాళ్లందరూ షుగర్, బి.పి పేషంట్లు కావడంతో టక్కున అందుబాటులో వున్న టాబ్లెట్స్ మింగేశారు. డెవిల్స్ డేవిడ్ రాజు వేపమండలతో దెయ్యాలను తరిమికొడుతున్నట్లు కాసేపు నటించి, ఆ తర్వాత వాతావరణాన్ని కూల్ చేశాడు. అందరికీ బి.పి సాధారణ స్థితికి వచ్చాక డెవిల్స్ డేవిడ్‌రాజు వుండి... మేడమ్, మీ ఇంటికి పట్టిన గ్రహాలను చాలావరకు వదిలించాను, కాని మీ పార్టీకి పట్టిన ఆత్మఘోషను వదిలించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా భూతవైద్యుల వల్ల కూడా కాదు! కొన్ని కోట్ల ఆత్మల ఘోష మీకు తగిలింది. ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో మీరు చేసిన పాపం చిన్నది కాదు, కోట్లాదిమంది ప్రజల మనసులను గాయపరిచారు. ఆ పాపం మిమ్మల్ని నీడలా వెంటాడుతోంది. వాళ్ల ఉసురు మీకు తగులుతోంది. ఈ పాపం పోవాలంటే దానికి పరిహారం చేసుకోవాలని సూచించాడు. అందుకు సోనియా... పాప పరిహారం ఎలా చేసుకోగలం స్వామీ... ఇప్పుడు విడగొట్టిన రాష్ట్రాలను అతికించలేం కదా అని అంది. వెంటనే కె.వి.పి.రామచంద్రరావు... ఆ రెండు రాష్ట్రాలను మళ్లీ కలపనవసరం లేదు తల్లి, ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామన్న ప్రత్యేకహోదా ఇస్తే చాలన్నాడు. సోనియా స్పందిస్తూ... ప్రత్యేకహోదా ఇవ్వడానికి మన చేతుల్లో ఏముంది, మనం అధికారంలో లేముగా అని అంది. అప్పుడు డెవిల్స్ డేవిడ్ రాజు... రాజ్యాంగంలో సవరణలు చేసుకోగలిగినట్లే మనం శాస్త్రాల్లో సవరణలు చేసుకోగలం మేడమ్, మీరు ప్రత్యేకహోదా ఇవ్వనక్కర లేదు, ప్రత్యేకహోదాకు పోరాడుతున్నట్లు నటిస్తే చాలు. ఆ పాపం పోతుంది. ముఖ్యంగా మన శాస్త్రాల్లో మీలాంటి వారి కోసం అనేక అవకాశాలను పొందు పరిచారు. వెయ్యికోట్ల ప్రజల సొమ్ము మింగిన నాయకుడు, ఒక శివరాత్రి రోజు జాగరణ చేస్తే చాలు. వంద హత్యలు చేసినోడు... పుష్కరాలలో మునిగితే చాలు. భూకబ్జాలకు పాల్పడిన వాళ్లు... చర్చికెళ్లి ఫాదర్‌ను తప్పులను మన్నించమని వేడుకుంటే చాలు... వన్‌టైం సెటిల్‌మెంట్‌లాగా ఒక్క పనితో పాపాలన్నీ మాఫీ అయిపోతాయని చెప్పాడు. అది వినగానే కెవిపి... మేడమ్, మనకు మంచి అవకాశం వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కల్పించాలంటూ నేను ప్రైవేట్ బిల్లును రాజ్యసభలో పెడతాను, మీరు జిఎస్‌టి బిల్లుకు దీనికి ముడి పెట్టండి. మేం కూడా ప్రత్యేకహోదా కోసం పోరాడుతున్నట్లు నటిస్తాం, మీరు కూడా ఆంధ్రప్రదేశ్ మీద లేని ప్రేమను నటించండి. ఎలాగూ మీకు మా రాష్ట్రం మీద అభిమానం లేదు, ప్రత్యేకహోదా బిల్లును బీజేపీ వాళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటారు. ఎందుకంటే, వాళ్లు అధికారంలో వుండగా ఆ క్రెడిట్ మనకు దక్కనివ్వరుగా! ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వలేదన్న పాపం మన మీద నుండి బీజేపీ మీదకు పోతుంది. విభజన నాటి నుండి మీకు తగులుతున్న ఆంధ్రుల ఆత్మఘోష కూడా వదులుతుందని చెప్పాడు. అందుకు సోనియా సరేనంది. మిగతా వాళ్లు కూడా ఈ ఐడియా భలే వుందన్నారు. అప్పుడు డెవిల్స్ డేవిడ్‌రాజు... మీరు బిల్లు పెట్టినా ప్రత్యేకహోదా రాదని మీకు తెలుసు... అంటే ఈ రకంగా కూడా ఆంధ్రులను మోసం చేయడమే... ఇది కూడా ఒక పాపమే! అని అన్నాడు. మరి దీనికి పరిహారమేంటని కెవిపి అడిగాడు. దానికి డెవిల్స్ డేవిడ్ రాజు... ఇంకేముంది శాస్త్రంలో ఇంకో సవరణను ఫాలో కావడమే... ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణ పుష్కరాలు జరుగుతున్నాయిగా, అందులోకి పోయి మునగడమే! మన పాపాల్ని కడగడానికే కదా... బావులు, చెరువులు సరిపోవని నదులు, సముద్రాలలో స్నానాలు చేస్తే పాపాలు పోతాయని చెప్పిందంటూ ఆయన పూజ ముగించి లేచాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

పదవులు, బాధ్యతలు, సభ్యత్వాలు స్వీకరిస్తారు. ఉద్యోగులకు పనిభారం ఉండి అధికారుల వత్తిడి పెరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు చేయండి, నిరుత్సాహ పడవద్దు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. పెండింగ్‌లో గల సమస్య పరిష్కారం కాగలదు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఉపాధి పథకాలలో స్థిరపడతారు. కొన్ని అదనపు ఖర్చులు కూడా తప్పవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు, అధికారులకు స్థానమార్పులుండవచ్చును. ఖర్చులు పెరిగినా ఇబ్బంది కలుగదు. ఆర్థిక పటిష్టత ఉండి, వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం పెరుగుతుంది. కొత్త వ్యాపారాలు, నిర్మాణాల వంటివి చేపట్టుతారు. కొత్త వస్తువులను సమకూర్చుకొంటారు. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. షేర్లపై ఆదాయముంటుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యాపారాభివృద్ధి అవకాశాలు, పెట్టుబడులకు అవకాశాలు చేజారిపోవచ్చును. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనండి. ఈ వారం ఖర్చులు బాగా పెరుగుతాయి. అవసరాలకు అప్పు చేయవలసి వస్తుంది. పెద్ద మొత్తాలలో ఆర్థిక లావాదేవీలను వాయిదా వేసికొనండి. పనులు సరిగా జరగక టెన్షన్ పడుతుంటారు. యాజమాన్యాలకు వర్కర్లతో సమస్యలు రావచ్చును.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కుటుంబంలో అభిప్రాయ భేదాలుండినా సర్దుబాటు కాగలవు. కొన్ని ముఖ్య చెల్లింపులు, పనులు వాయిదా వేసుకొంటారు. విద్యార్థులకు తమ బాధ్యతలలో సంతృప్తి ఉంటుంది. పరిచయాలు వ్యాపకాలు పెరుగుతాయి. కొత్త ఉద్యోగావకాశాలకు అనుకూల సమయం. ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి ఉపాధి రంగాల వారికి ఆర్థిక స్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అదనపు ఖర్చులు ఏదో ఒక విధంగా తప్పనిసరిగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. కళా క్రీడా శాస్త్ర సాంకేతిక రంగాలలో ఉద్యోగ అవకాశాలుంటాయి. కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం. బంధువులతో మాట పట్టింపులు, సమస్యలు రావచ్చును. అనుకున్న పనులు ఎంత సమర్థవంతంగా నిర్వహించినా ఆటంకాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కాంట్రాక్టర్లకు, వ్యాపారులకు పరిశ్రమ యాజమాన్యాలకు ప్రభుత్వ వత్తిడి పెరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కుటుంబ సౌఖ్యం, కొత్త వస్తువులు కొనడం జరుగుతుంది. ప్రభుత్వ సంబంధమైన పనులందు అదనపు ఖర్చులు పైనబడగలవు. అనుకున్న పనులు కూడా నిదానంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 5.8.2016 నుండి
తేది. 11.8.2016 వరకు

ఈ వారం కర్కాటకంలో రవి, సింహంలో గురు బుధ శుక్ర రాహువులు, వృశ్చికంలో శనికుజులు, కుంభంలో కేతువు, సింహ కన్య తులా రాశుల్లో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 12 శుక్రవారం కృష్ణానదీ పుష్కరాలు ప్రారంభము.
వరలక్ష్మీ వ్రతము.

### శ్రావణ మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 5 | శుక్ర | తదియ | రా॥ గం.2.14వ॥ |
| తేది. 6 | శని | చతుర్థి | రా॥ గం.3.12వ॥ |
| తేది. 7 | ఆది | పంచమి | రా॥ గం.4.40వ॥ |
| తేది. 8 | సోమ | షష్ఠి | పూర్తిగ |
| తేది. 9 | మంగళ | షష్ఠి | ఉ॥ గం.6.26వ॥ |
| తేది. 10 | బుధ | సప్తమి | ఉ॥ గం.8.25వ॥ |
| తేది. 11 | గురు | అష్టమి | ఉ॥ గం.10.27వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

నూతన వస్తువులు కొనడం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు నిర్ణయం కావచ్చును. ఉద్యోగులకు కార్యసమర్థత, అధికారుల ఆదరణ ఉంటుంది. కోర్టు కేసులందు అనుకూలత, రావలసిన బాకీలు కొంతమేరకు లభించడం జరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

డబ్బు, వస్తువులు జాగ్రత్తగా కాపాడుకొనండి. దూర ప్రయాణాలుంటాయి. ఆహ్వానాలు అందుకొనడం, సభలు సమావేశాలలో పాల్గొనడం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యం, విద్యా ప్రగతి బాగుంటుంది. పట్టుదలకు పోయి వివాదాలు తెచ్చుకొనకుండా సర్దుబాటు చేసికొంటూ పనులు జరుపుకొనండి. మీపై నిందలు, విమర్శలుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబంలో కొంత భిన్నాభిప్రాయాలుండగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఉద్యోగులు అధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా వ్యవహరించండి. వృత్తి వ్యాపారాలలో ఆర్థికాభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. అయినా ఖర్చులు కూడా ఏదో ఒక రూపంలో పైనబడగలవు. రావలసిన బాకీలు వాయిదా పడతాయి. యాజమాన్యాలు వర్కర్లతో జాగ్రత్తగా ఉండాలి.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగావకాశాలు లభించగలవు. కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. కుటుంబసౌఖ్యం, ఇతరులకు సహాయ పడటం జరుగుతుంది. కొత్త వస్తువులు, విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. ఆరోగ్య లోపం జరుగకుండా చూచుకొనాలి. ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలు ఫలించగలవు. అయితే ఖర్చులు పెరిగినా భారమనిపించవు. అనుకున్న పనులు నెరవేరగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఉద్యోగులకు పని భారం, చికాకు శ్రమ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగావకాశాలకు కొద్ది కాలం పట్టవచ్చును. బాకీల వత్తిడి పెరుగుతుంది. కోర్టు కేసులు వాయిదా పడతాయి. బిడ్డల విద్యా వివాహ ప్రయత్నాలలో అనుకూలత కలదు. అనుకున్న పనులకు ఆటంకాలు కలగడం, టెన్షన్, కోపం ఎక్కువగా ఉంటుంది. సమస్యలను ప్రశాంతంగా పరిష్కరించుకొనవలెను.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

శుభకార్యాలందు సభలు సమావేశాలందు పాల్గొంటారు. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. షేర్లు పెట్టుబడులకు అవకాశాలు దొరకగలవు. పరిచయాలు బలపడతాయి. ఆరోగ్యం బాగుంటుంది. మొగమాటాలకు లొంగకండి. అనవసర పనులు మీపై రుద్దుతారు జాగ్రత్త. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆర్థిక వ్యవహారిక ఒప్పందాలకు అనుకూల సమయం.

## కావలి కబుర్లు

# మానవ అక్రమ రవాణా అరికడదాం




తొలిసంతకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అలేఖ్య

మానవ అక్రమ రవాణాను అరికడదామని మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య అన్నారు. జులై30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రోవైల్డ్ గ్రూప్ మరియు చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సహకారంతో నెల్లూరు జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక విశ్వోదయా పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అలేఖ్య మాట్లాడుతూ.. మానవులను అక్రమ రవాణాచేసే ముఠాలను ప్రభుత్వం క్షమించదని మహిళలను బానిసలుగా వ్యభిచార గృహాలకు తరలించేవారిపై కఠినచర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకడుగు వేయబోరన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌రైట్స్ ఫోరం కావలిడివిజన్ ఇన్‌చార్జి గగన కుమారి, సభ్యులు ఎమ్‌డి అబ్దుల్ అలీం, సోమిశెట్టి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక హోదా ఇచ్చితీరాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు దేగా సత్యన్నారాయణ

కేంద్రప్రభుత్వం ప్రత్యేకహోదా ఇచ్చితీరాలని... అంతవరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి దేగా సత్యన్నారాయణ అన్నారు. జులై 30న ఆంధ్రాకు ప్రత్యేకహోదా ఇవ్వనందుకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో కేంద్రం దిష్టి బొమ్మను స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి బాలకోటయ్య, దేగా సత్యనారాయణ మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రెండుగా విభజించి అన్యాయం చేసిందని ఆ సమయంలో ఆంధ్రాకు ఐదు సంవత్సరాలు ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పారన్నారు. అయితే జీజేపీ, టీడీపీ పార్టీలు మేము అధికారంలోకి వస్తే పది సంవత్సరాలు ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇస్తామని నమ్మబలికి ఎన్నికలలో గెలిచిన తరువాత ప్రజలను మోసం చేశాయన్నారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఆనాడు పదిసంవత్సరాలు ప్రత్యేకహోదా ఇస్తామని గంటమ్రోగించి ఈరోజు వెనకడుగువేయడం సిగ్గుచేటన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలైనా ప్రత్యేకహోదా ఇవ్వకపోగా ప్రధానమంత్రి ఆంధ్రాకు బంగారు పళ్లెం ఇస్తామని చెప్పి, నేడు ఆర్థికమంత్రి అరుణ్ జెట్లీచే మన ముఖ్యమంత్రికి చిప్పచేతికిచ్చి పంపారన్నారు. ఆంధ్రాకు ప్రత్యేకహోదా తేవడంలో బాబు పూర్తిగా విఫలమయ్యారని రానున్న రోజులలో ప్రత్యేకహోదాకై జరుగుతున్న ఉద్యమాలలో అన్నిపార్టీలు భాగస్వాములై ప్రత్యేకహోదా సాధించేదాకా పోరాడతాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆలోచించి ప్రత్యేకహోదా ఇవ్వాలని లేకుంటే కాంగ్రెస్‌కు పట్టిన గతే బీజేపీ, టీడీపీలకు పడుతుందని ప్రజలే తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# కొరియడ్ కంటి వైద్యశిబిరం




రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కావలి రూరల్ మండలంలో పేపర్లవారిపాలెం గిరిజన కాలనీలో కొరియడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్యనిపుణులు రమేష్, అరుంధతి పాల్గొని రెండువందల మందిని పరీక్షించి ఉచితంగా మందులు, కంటి అద్దములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు డా॥ రావెల జయపాల్, కాపల్లి ప్రసాద్, ప్రభుదాస్, రవీంద్ర తదితరులుపాల్గొన్నారు.

# వీరభద్రరావు సేవలు మరువలేనివి



వీరభద్రరావు దంపతులను సత్కరిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు

వీరభద్రరావు సేవలు మరువలేనివని నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎమ్.రాముడు అన్నారు. జులై 30వ తేదీ జూనియర్ టెక్నికల్ అధికారి వీరభద్రరావు పదవీవిరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ.. నీటిపారుదల శాఖలో వీరభద్రరావు అంకితభావంతో పనిచేసి పదవీ విరమణ చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏటీఓ రవీంద్రరెడ్డి, డీఈలు శ్రీదేవి, రవికుమార్, ప్రసాద్‌రావు, సుజిత్‌కుమార్, ఉమామహేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# విలీన నిర్ణయాన్ని మార్చుకోవాలి




ఎస్‌బిఐ వద్ద ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

బ్యాంకుల ప్రైవేటీ కరణను, విలీన నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం మార్చుకోవాలని జూనియర్ నాయకులు కె.హరినారపరెడ్డి అన్నారు. ఇటీవల తొమ్మిది యూనియన్లు కలిసి యూ.ఎఫ్.బి.యు కింద సమ్మెకు పిలుపునిచ్చిన సందర్భంగా కావలిలో అన్ని బ్యాంకు ఉద్యోగులు కలిసి ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా హరినారపరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న బ్యాంకు వ్యతిరేక కలాపాలు, ప్రభుత్వబ్యాంకుల విలీనం, ప్రభుత్వబ్యాంకులలో కార్పొరేట్ భాగస్వామ్యం పెంచడం వంటి చర్యలకు వ్యతిరేకంగా ఉద్యోగులు నిరసన తెలిపారన్నారు. బ్యాంకు ఉద్యోగులకు మద్దతుగా వ్యవసాయ కార్మికసంఘం నాయకులు టి.మాల్యాద్రి, సిఐటియు నాయకులు రామయ్య పాల్గొన్నారు. ఈ ధర్నాలో శ్రీరామ్మూర్తి, కుమార్, బి.నారాయణస్వామి, సుమంత్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా ఎయిర్‌పోర్ట్ భూసేకరణ



దగదర్తి వద్ద ఏర్పాటు చేయనున్న గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయంకు సంబంధించి 606 ఎకరాలను త్వరితగతిన సేకరించి తద్వారా విమానాశ్రయ ఏర్పాటును వేగవంతం చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అన్నారు.

బుధవారం ఉదయం దగదర్తి మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో విమానాశ్రయం కొరకు సేకరించే భూములకు రెండవ విడత నష్టపరిహారం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 20వ తేదీన తొలివిడత నష్టపరిహారం పంపిణీ జరిగిందని, ఆరోజున 61 మంది రైతులకు వారి వారి ఖాతాలలో నష్టపరిహారం జమ చేయడం జరిగిందన్నారు. ఈరోజున కె.కె.గుంటకు సంబంధించి 12 మంది డి.కె.టి. భూములకు, దామవరం డి.కె.టి. భూములకు సంబంధించి 10మందికి, అదే విధంగా దామవరం సిజెఎఫ్ఎస్ భూములకు సంబంధించి 22మందికి వెరసి మొత్తం 44మందికి నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కోర్టు కేసులు వున్న భూములపై చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని, పెద్ద సమస్యలున్నట్లైతే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సేకరించనున్న 606 ఎకరాలలో పట్టా భూములు 336.32 ఎకరాలు, డికెటి భూములు 104.92 ఎకరాలు, సిజెఎఫ్ఎస్ భూములు 129.40, ప్రభుత్వ భూములు 25.45ఎకరాలు, 10.58 పోరంబోకు భూములు వున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.ఎండి ఇంతియాజ్, దగదర్తి యంఆర్ఓ మధుసూదన్‌రావు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మీ వెన్నంటి నడుస్తాం...



రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోసం పోరాడుతున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు నెల్లూరులోని మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవా సమితి సభ్యులు అశోక్, లేకిన్‌రెడ్డి, సుజిత్, వీరేష్, గిరిష్, నిషాద్, నానిలు. గురువారం నెల్లూరులో యువభేరి సదస్సుకు విచ్చేసిన జగన్మోహన్‌రెడ్డికి వారు ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర భవితకు ప్రత్యేకహోదా అవసరమని, హోదా వస్తేనే రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రత్యేకహోదా కోసం జగన్ చేసే ఉద్యమంలో వెన్నంటి నడుస్తామని వారు తెలిపారు.

# ఇంటింటికి మొక్కల పంపిణీ

నెల్లూరురూరల్ మండలం పొట్టేపాళెం గ్రామంలో ఆదివారం శ్రీ కోదండ రామ స్వామి ఆలయ ఛైర్మెన్ పొన్నాల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కొత్త హరిజనవాడ పార్కు స్థలంలో స్థానిక ప్రజలతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హరిజనవాడలో స్థానికులకు ఇంటికో మొక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటశేషారెడ్డి, పార శీనయ్య, హరి, రమణయ్య, సుబ్బయ్య, శీనయ్య, నాగయ్య, నరసమ్మ, కోటేశ్వరమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# అనాధగా ఆంధ్రా!

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ విభజన ఎంత దారుణంగా జరిగిందన్నది అందరికీ తెలిసిందే! జలియన్ వాలాబాగ్ దుర్ఘటన బ్రిటీషోళ్ల హయాంలో జరిగింది. కాని ఏపి విభజన చీకట్లో జరిగింది. సోనియాగాంధీ ఈర్ష్యాద్వేషాల వల్ల జరిగింది. ఒకర్ని కాదు, వందమంది, వేలామందిని కాదు అయిదు కోట్ల మంది ఆంధ్రులను మానసిక క్షోభకు గురిచేసే విధంగా ఆనాడు సోనియాగాంధీ కనుసైగలతో రాష్ట్ర విభజన జరిగింది. తెలంగాణకు సూటూ బూటు తొడిగి, ఏపిని గోచీగుడ్డతో రోడ్డు మీద పడేసారు. ఇంతటి అన్యాయమైన రాష్ట్ర విభజన గతంలో జరగలేదు. భవిష్యత్‌లోనూ జరగబోదు. విభజన బిల్లులో ప్రత్యేకహోదా కల్పించే అంశాన్ని పొందుపరచకుండా యూపిఏ పార్లమెంటులో దీనిని ప్రవేశ పెట్టింది. ఈ బిల్లుతో ఏపికి అన్యాయం చేస్తున్నారని బీజేపీ అగ్రనేత అద్వానీ ఆవేదన చెందినా, సోనియాతో చేతులు కలిపిన సుష్మాస్వరాజ్ లోక్‌సభలో గుడ్డిగా ఈ బిల్లును ఆమోదించేశారు. రాష్ట్రం నుండి పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తేసరికి రాజ్యసభలో బీజేపీ అడ్డం తిరిగింది. ఏపికి ప్రత్యేకహోదా హామీ ఇస్తేనే బిల్లును ఆమోదిస్తామంటూ ఆ పార్టీ నాయకులు అరుణ్‌జైట్లీ, వెంకయ్య నాయుడులు అడ్డం తిరిగారు. ఆరోజుకు ఏపి ప్రజలకు వాళ్లిద్దరూ ఆశాకిరణాలుగా కనిపించారు. వారిద్దరి పంతం వల్లే ప్రధానిగా వున్న మన్మోహన్‌సింగ్ ఏపికి 5ఏళ్లు ప్రత్యేకహోదా ప్రకటించారు. ఐదేళ్లు కాదు, పదేళ్లు ప్రత్యేకహోదా కావాలని అడిగింది కూడా వీళ్లే! మేం అధికారంలోకి రాగానే ఏపికి పదేళ్లు ప్రత్యేకహోదా కల్పిస్తామని చెప్పింది కూడా వీళ్లే! తల్లిని చంపి బిడ్డను బయటకు తీసారంటూ ఏపి పట్ల ఆనాడు తీవ్రమైన సానుభూతిని చూపింది కూడా బీజేపీ ప్రధాని అభ్యర్థిగా, ఈనాడు దేశ ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీనే!

బీజేపీ అంటే ప్రజలలో ఒక గౌరవం ఉంది. ఆ పార్టీకి ఓటే యని వాళ్లు కూడా ఆ పార్టీ సిద్ధాంతాలను గౌరవిస్తారు. మాటకు కట్టుబడతారని, క్రమశిక్షణ పాటిస్తారని, అవినీతికి చాలావరకు దూరంగా ఉంటారని ఆ పార్టీకి పేరుంది. కాంగ్రెస్‌లోలాగా వారసత్వ రాజకీయాలు ఉండవని, కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందని ముద్రవుంది.

ఆ పార్టీపై వున్న ఈ సదభిప్రాయాలన్నీ కూడా ఈరోజు ఏపి ప్రజల్లో లేవు. బీజేపీ అంటే ఒక మోసకారి పార్టీగా ముద్రపడి పోయింది. ఈ రాష్ట్రంలో ఆ పార్టీకి పట్టు లేకపోవచ్చు. సీట్లు రాకపోవచ్చు. అంత మాత్రాన ఈ రాష్ట్రానికి ఇచ్చిన మాటను మరుస్తారా? మాటను మారుస్తారా? 2014 ఎన్నికల్లో నరేంద్ర మోడీని చూసే ఏపి ప్రజలు చంద్రబాబుకు ఓట్లేసారు. మరి ఆ విశ్వాసం కూడా లేదా? రాష్ట్రానికి రాజధాని లేక, నిధులు రాక, ప్రత్యేకహోదా ఇవ్వక... ఇక ఈ రాష్ట్రం ఎలా మనుగడ సాగించాలి.

## కాంగ్రెస్‌దీ వంచనే..!

కాంగ్రెస్ ఎంపీ కె.వి.పి.రామచంద్రరావు ఏపికి ప్రత్యేకహోదా కల్పించే ప్రైవేట్ బిల్లును రాజ్యసభలోకి తేవడంతోనే ఈ అంశంపై రచ్చ మొదలైంది. ఏపికి అన్యాయం చేసిన మొదటి ముద్దాయి కాంగ్రెస్. ఆరోజే విభజన బిల్లులో ప్రత్యేకహోదా అంశాన్ని చేర్చివుంటే ఈరోజు బీజేపీ కుంటిసాకులు చెప్పడానికి అవకాశ ముండేది కాదు. తెలంగాణలో సీట్లన్నీ కాజేయాలనే దురాశతో ఏపి చేతికి చిప్ప ఇచ్చారు. తెలంగాణలో కేసీఆర్ నడ్డి మీద తన్నేసరికి ఏపికి ఎంత అన్యాయం చేసారో వారికి గుర్తొచ్చింది. చేసిన పాపానికి లెంపలేసుకుంటూ పార్లమెంటులోకి ప్రైవేట్ బిల్లు తెచ్చారు. ఈ ప్రైవేట్ బిల్లు పార్లమెంటు దాకా రాదని, వచ్చినా ఆమోదం పొందదని వారికి తెలుసు. అయినా ఏపి కోసం ఏదో చేసామని చెప్పడానికి ఈ బిల్లును తెచ్చారు.

## చంద్రబాబే ప్రధాన అడ్డంకి..

అధికారాన్ని చేపట్టింది మొదలు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోసం కేంద్రంతో ఏరోజూ గట్టిగా పోరాడ లేదు. రాష్ట్ర ప్రయోజనాల కంటే సొంత ప్రయోజనాల కోసమే ఆయన కేంద్రంతో రాజీపడుతూ వచ్చారు సరికదా, ప్రత్యేకహోదా సంజీవని కాదంటూ, ప్రత్యేకప్యాకేజీ ఇస్తే చాలంటూ అర్రులు చాచారు. ముఖ్యమంత్రే ప్రత్యేకహోదాపై వీక్ కావడంతో కేంద్రం సైతం దీనిని సీరియస్‌గా తీసుకోలేదు. విభజన చట్టంలో ప్రత్యేక హోదాను ప్రస్తావించలేదని, నిబంధనలకు విరుద్ధంగా ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వలేమంటూ బీజేపీ ఈ అంశాన్ని దాటవేస్తూ వస్తోంది.

## అసలు కారణమేంటి?

ఏపికి ప్రత్యేకహోదా కల్పించడంపై దేశవ్యాప్తంగా కూడా మెజార్టీ పార్టీలకు అభ్యంతరం లేదు. పార్లమెంటు సాక్షిగా అన్ని పార్టీలు దీనిని ఆమోదించాయి కాబట్టి ఈరోజు ఎవరూ అభ్యం తరం పెట్టే పరిస్థితి లేదు. ప్రత్యేకహోదా ఇవ్వడానికి ఈరోజు బీజేపీ ఒక్కటే అడ్డంకిగా మారింది. ఇచ్చిన దానివల్ల వాళ్లకొచ్చే నష్టమేంటన్నది ఇప్పుడు నడుస్తున్న చర్చ. ఏపికి హోదా ఇచ్చినా ఇవ్వకపోయినా వారికొచ్చే నష్టం గాని, లాభం కాని ఏమీ లేదు. ఇచ్చిన దానివల్ల రాష్ట్రంలో ఆ పార్టీ కొత్తగా బలపడేదేమీ లేదు. ఇక్కడ రెండు బలమైన ప్రాంతీయ పార్టీలున్నాయి. అవసరాన్ని, అవకాశాన్ని బట్టి ఏదో ఒక పార్టీ తమతో కలిసి వస్తుందని వారి అంచనా! ఇప్పుడు ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే, ఆ వెంటనే పలు రాష్ట్రాలలో ప్రత్యేకహోదా డిమాండ్‌లు లేవనెత్తుతారు. బీహార్ రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తోంది. అలాగే పశ్చిమబెంగాల్, ఒరిస్సా, అస్సాం రాష్ట్రాలలోనూ ఈ డిమాండ్ రావచ్చు. ఇక ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే ముందుగా నష్టపోయేది తమిళనాడు. ఆ రాష్ట్ర రాజధాని చెన్నై, ఆంధ్రా సరిహద్దుల్లో వుంది. అక్కడ పరిశ్రమలు ఎత్తేసి ఏపి సరిహద్దుల్లోని చిత్తూరు, నెల్లూరుజిల్లాల్లో నెలకొల్పే అవకాశముంది. రాజ్యసభలో బీజేపీ బలం తక్కువ. ఏ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్నా ప్రాంతీయ పార్టీలపై ఆధారపడాల్సి వస్తుంది. అదీగాక వచ్చే ఎన్నికల నాటికి అన్నాడిఎంకెతో పొత్తు పెట్టుకోవాలన్న దిశగా బీజేపీ వుంది. ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే జయలలిత ఆగ్రహిస్తుంది. ఆమెను దృష్టిలో ఉంచుకుని కూడా బీజేపీ ఏపికి మొండిచేయి చూపిస్తోంది.

## ఢిల్లీలో తిరగని చక్రం..

గతంలో యునైటెడ్ ఫ్రంట్ హయాంలోనూ, ఆ తర్వాత వాజ్‌పేయి సంకీర్ణ ప్రభుత్వంలోనూ చంద్రబాబు గిర్రున చక్రం తిప్పారు. ఆరోజున్న ప్రధానులు కూడా చంద్రబాబుకు ప్రాధాన్యత నిచ్చారు. అప్పుడు పరిస్థితి వేరు. ఏపి పెద్ద రాష్ట్రం. 42 లోక్‌సభ సీట్లు. కాబట్టి ఆ గౌరవం ఉండేది. విభజన తర్వాత ఏపి చిన్న రాష్ట్రమైంది. 29మంది ముఖ్యమంత్రులలో చంద్రబాబు కూడా ఒకడయ్యాడు. అదీగాక చంద్రబాబు రెండున్నరేళ్ల పాలన కూడా ఏమంత ఎఫెక్టివ్‌గా లేదు. అవినీతి ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ఖజానాను నిలువునా ఖాళీ చేస్తున్నారు. దుబారా పెరిగిపోయింది. ఇవన్నీ కూడా చంద్రబాబును వదిలించుకోవా లనేంత దూరానికి బీజేపీని తీసుకెళ్లాయి.

## తెగదెంపులకు బీజేపీయే సిద్ధం..

కేంద్రాన్ని చంద్రబాబు ఘాటుగా హెచ్చరించారని, ఆయన దెబ్బకు నరేంద్ర మోడీ వణుకుతున్నాడని, కేంద్రం ప్రత్యేకహోదాపై చర్చిస్తుందని పసుపు మీడియా చిలువలు పలువలుగా రాస్తుంది. ఇదంతా ట్రాష్. చంద్రబాబును మోడీ అసలు లెక్కలోకి కూడా తీసుకోవడం లేదు. తెలుగుదేశం ఎంపీలకు ప్రధాని అపాయింట్ మెంట్ దొరకడం కూడా కష్టమైంది. చంద్రబాబు నేను ఎన్డీఏ నుండి పోతానంటే పొమ్మనడానికి వాళ్లు సిద్ధంగా ఉన్నారు. ఎందుకంటే 2019 ఎన్నికల నాటికి చంద్రబాబు తమతో ఉండ డనే విషయం వారికి తెలుసు. బీజేపీ పాజిటివ్ ఓటు చంద్ర బాబుకు ఉపయోగపడుతుంది. చంద్రబాబు నెగటివ్ ఓటు బీజేపీ మీద పడుతుంది. 1999లో వాజ్‌పేయి పట్ల వున్న అభిమానం తోనే ఈ రాష్ట్రంలో తెలుగుదేశం గెలిచింది. 2004లో మాత్రం ఈ రాష్ట్రంలో చంద్రబాబు మీదున్న వ్యతిరేకత వల్లే బీజేపీ మట్టికొట్టుకుపోయింది. 2014లో మళ్లీ మోడీ ఇమేజ్ చంద్ర బాబును అధికారంలో నిలబెట్టింది. 2019లో కూడా వీళ్ల పొత్తు ఇలాగే వుంటే చంద్రబాబుపై వున్న వ్యతిరేకత బీజేపీ మీద కూడా పడుతుంది. అందుకనే బీజేపీ వాళ్లు తెగదెంపు లకు సిద్ధంగా వున్నా చంద్రబాబు మాత్రం ఎన్నికల దాకా వారిని వదలకపోవచ్చు.

ఇప్పటివరకు కూడా కేంద్రం ఇస్తున్న నిధులతోనే చంద్రబాబు నెట్టుకొస్తున్నాడు. రాష్ట్ర ప్రజలు కట్టే పన్నులను పుష్కరాలు, పట్టిసీమ, మజ్జిగ ప్యాకెట్ల పేరుతోనే ఊడ్చేస్తు న్నారు. కేంద్రం నిధులివ్వకుంటే ఇక్కడ బండి నడవదు. చంద్రబాబు ఎన్డీఏ నుండి బయటకొస్తే ఆ నిధులు కూడా రాక పరిస్థితి ఇంకొంచెం క్లిష్టంగా మారుతుంది. కాబట్టి ఎన్ని ప్రగల్భాలు పలికినా ఎన్నికలదాకా చంద్రబాబు బీజేపీని వదిలే ప్రశ్నే లేదు. అలా ధైర్యం చేసి బయటకొచ్చా డంటే కోరి కొరివితో గోక్కున్నట్లే!

## హోదాపై ఆశలు వదులుకోవాల్సిందేనా?

అరుణ్‌జైట్లీ చెప్పిన దాన్ని బట్టి చూస్తే ప్రత్యేకహోదాపై ఆశలు లేనట్లే! కాకపోతే దింపుడుకళ్లం ఆశ ఒకటుంది. ఎన్నికలకు ముందైనా ప్రత్యేకహోదా కల్పిస్తారని! ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చిన క్రెడిట్ కాంగ్రెస్‌కో, టీడీపీకో పోవ డానికి బీజేపీ ఇష్టంగా లేదు.

టీడీపీతో తెగదెంపులయ్యాక ఈ రాష్ట్రంలో తమ ఉనికిని నిలబెట్టుకోవడం కోసం అప్పుడు ప్రత్యేకహోదా ప్రకటించినా ఆశ్చర్యపోనక్కరలేదు. అయితే అప్పటిదాకా మనం నోర్లు, కళ్లు తెరచి ఎదురుచూడాల్సిందే!



ఈ నెల 2వ తేదీన జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజును కలిసి అభినందిస్తున్న జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

# మహా కూటమి

(మొదటి పేజీ తరువాయి)

ఒకే వేదికపై చేరే అవకాశాలు కనిపిస్తు న్నాయి. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా వున్న వైకాపాతో జట్టు కట్టేందుకు కాం గ్రెస్‌తో పాటు సిపిఎం, సిపిఐ వంటి పార్టీలు సైతం సిద్ధంగా ఉన్నాయి. సీట్లలో సైతం సింహభాగం వైకాపాకే ఇచ్చి ఈ మూడు పార్టీలు కూడా 30 నుండి 50 సీట్లకు పరిమితమయ్యేందుకు సిద్ధంగా వున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి.

రాష్ట్రంలో ఈ మూడు పార్టీలు బలంగా లేకపోవచ్చు. కాని ప్రతి నియోజక వర్గంలోనూ వెయ్యి మొదలుకొని పాతిక వేల వరకు ఓట్లు సాధించగల నాయకు లున్నారు. అదీగాక 2019 ఎన్నికల నాటికి రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ మీద కోపం కూడా తగ్గొచ్చు. ఎంత హీనంగా లేదన్నా ప్రతి ఊరులో కాంగ్రెస్‌కు ఓట్లుంటాయి. వైకాపా అభ్యర్థులు వెయ్యి నుండి 5వేల లోపు ఓడిపోయే అవకాశం ఉన్న చోటల్లా ఈ ఓట్లు పడితే, ఓడిపోయే స్థానాలను గెలుచుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇక సీపీఎం, సీపీఐ పార్టీల కార్యకర్తలైతే కొద్దిమందే వున్నా ఎన్నికల్లో మాత్రం కంకణబద్ధులై పనిచేస్తారు. వామపక్షాలకు ఎన్ని ఓట్లున్నా ఖచ్చితంగా పొత్తున్న పార్టీ అభ్యర్థులకే పడతాయి.

అదీగాక ఈ పార్టీలు నాలుగు కలిసి కూటమి కడితే తెలుగుదేశం నుండి కూడా కొందరు నాయకులు తిరిగి సొంత గూటికి వచ్చే అవకాశముంది. ముఖ్యంగా చంద్ర బాబు 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టు కుని 'రెడ్డి' నాయకులకు వలవేశాడు. కొందరు నాయకులు టీడీపీలోకి వెళ్లారు. టీడీపీలోకి వెళ్లిన రెడ్లను తిరిగి రప్పించా లని కాంగ్రెస్ అధిష్టానం ఆలోచిస్తుంది. అందుకే మాజీముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి ఒక దశలో బీజేపీలో చేరాలని మంతనాలు సాగించినా, భవిష్యత్‌లో జరగ బోయే మార్పులను ఆయనకు వివరించి కాంగ్రెస్ అధిష్టానం ఆయనను అక్కడే వుంచే సింది. భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ నుండి రెడ్లకు కిరణ్‌ను, కాపులకు చిరంజీవిని ప్రతినిధులుగా తెరమీదకు తేబోతున్నారు. కాపు, రెడ్లను ఒక చోట చేర్చి, ప్రభుత్వ వ్యతిరేక ఓటును అదే గూటికి చేర్చగలి గితే ఈ ప్రయోగానికి తిరుగులేనట్లే!

# తెదేపా-వైకాపా

(మొదటి పేజీ తరువాయి)

హోదా విషయంలో ఢిల్లీలోనే కాదు, రాష్ట్రంలో సైతం ఆందోళనలకు పిలుపునివ్వడం ద్వారా వైకాపా ముందంజవేసింది. ప్రత్యేక హోదా రాష్ట్ర ప్రజల ఆశ. కాబట్టి వైకాపా బంద్‌కు సైతం ప్రజలు స్పందించారు. ఈ కొద్దిరోజుల్లోనే ప్రత్యేకహోదా అంశం మూలంగా తెలుగుదేశంకు భారీ డామేజ్ కాగా వైకాపాకు అనూహ్యంగా ఇమేజ్ పెరగడం విశేషం.



సర్వేంద్రియానాం నయనం ప్రధానం

శుభప్రారంభం

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన

# డా॥ అగర్వాల్స్

కంటి ఆసుపత్రి

# ఇప్పుడు నెల్లూరులో

గత మూడున్నర దశాబ్దాలకుపైగా కంటి వైద్యరంగంలో ప్రఖ్యాతిగాంచిన



**డా॥ బి.శివప్రతాప్‌రెడ్డి గారి ఆధ్వర్యంలో**

తే.09.08.2016ది మంగళవారం

ఉదయం 11గంటల నుండి 12 గంటలు లోగా శుభప్రారంభం.

ప్రారంభకులు



**కుమారి రెజీనా**

ప్రముఖ సినీ హీరోయిన్



**ఆర్.ముత్యాలరాజు**

నెల్లూరు జిల్లా కలెక్టర్



**అబ్దుల్ అజీజ్**

మేయర్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్

వేదిక:

**డా॥ అగర్వాల్స్ కంటి ఆసుపత్రి**

బొల్లినేని ఆసుపత్రి ఎదురుగా, జి.ఎన్.టి.రోడ్డు, దర్గామిట్ట, నెల్లూరు. ఫోన్: 2337555.

## అందరూ ఆహ్వానితులే...

**డా॥ ఆదిల్ అగర్వాల్**

డైరెక్టర్, డా॥ అగర్వాల్స్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్స్

**డా॥ శివ ప్రతాప్ రెడ్డి**

మెడికల్ డైరెక్టర్, నెల్లూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com